వార్తసంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు...

Published From : Rangareddy VOLUME : 01 Issue : 315 Sunday 1-11-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal--Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet

జమ్ము కశ్మీర్ సీఎంపై

24 మంది ఎమ్మెల్యేల అసంతృప్తి



7

ఆ చోరీ వెనుక ఉన్నది నార్త్ కొరియా హ్యాకర్లే



7



ఓటు చోరీతో నెహ్రూ

పీఎం అయ్యారు!

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సంచలన ఆరోపణలు
- పటేల్‌కు మద్దతు ఉన్నా నెహ్రూకు ప్రధాని పదవి దక్కిందని వ్యాఖ్య
- కాంగ్రెస్ గతంలోనే ఓటు చోరీకి పాల్పడిందని విమర్శ
- 550 సంస్థానాలను విలీనం చేసిన ఘనత పటేల్‌దే
- నెహ్రూ స్వార్థ రాజకీయాలతో విలీన ప్రక్రియలో గందరగోళం
- మోదీ వల్లే జమ్ము కశ్మీర్ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- పటేల్ జీవిత చరిత్రను యువత తెలుసుకోవాలి: రామచందర్‌రావు
- బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పటేల్ జయంతి వేడుకలు

/హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ గతంలోనే ఓటు చోరీకి పాల్పడిందని, ఆ విధంగా జవహర్‌లాల్ నెహ్రూను ప్రధానిని చేసిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం ఓటు చోరీ జరిగిందంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారని, కానీ గతంలో ఆ పార్టీ చేసిన పనులను గుర్తు చేసుకోవాలని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు.

-మిగతా 2 లో

హుడా కాలనీలో మాజీ కార్పొరేటర్ భవనంపై

ప్రకృతి నిర్బంధ ఆంక్షలు!

- సీజ్ చేసినా మళ్లీ జోరుగా నిర్మాణ పనులు!
- స్టిల్ట్+2 అనుమతితో సెల్లార్+5 నిర్మాణమా?
- ప్రారంభోత్సవానికి శరవేగంగా పనులు
- అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం!
- ఎల్బీనగర్ టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణపై తీవ్ర ప్రశ్నలు!

ఎల్బీనగర్, అక్టోబర్ 27 (వార్త సంధ్య)

సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని హుడా కాలనీ, మైత్రిపురం ప్రాంతంలో భవన నిర్మాణంపై అక్రమాల ఆరోపణలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. సరూర్‌నగర్ మోర్ సూపర్ మార్కెట్ పక్కన, టీకేఆర్ కమాన్ ఎదురుగా కొనసాగుతున్న ఓ భవన నిర్మాణంలో అనుమతులకు మించి అంతస్తులు నిర్మించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టిల్ట్+2 అంతస్తులకు అనుమతి తీసుకుని స్టిల్ట్+5 వరకు నిర్మాణం చేపట్టారన్న ఫిర్యాదుల నేపథ్యంలో, గతంలో సీజ్ చేసి, కొంత భాగాన్ని కూల్చివేసినట్లు చెబుతున్న భవనంలో ప్రస్తుతం మళ్లీ నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతుండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాల్సిన అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. సీజ్ చేసిన భవనంలోనే తిరిగి పనులు సాగుతుంటే సంబంధిత అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదన్నది ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.

గతంలో సీజ్.... అయినా ఆగని పనులు?

గతంలో సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ భువనగిరి శ్రీనివాస్ ఆదేశాల మేరకు హుడా కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఓ భవనాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేసినట్లు అప్పట్లో వెల్లడైంది. స్థానిక సామాజికవేత్త లంక లక్ష్మీనారాయణ లిఖితపూర్వకంగా చేసిన ఫిర్యాదు నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, ఉల్లంఘనలు ఉన్నట్లు గుర్తించిన అనంతరం ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. సదరు భవన యజమాని మాజీ కార్పొరేటర్ భర్త అని, రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టారని లంక లక్ష్మీనారాయణ గతంలో ఆరోపించారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే భవిష్యత్తులో డ్రైనేజీ, ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రజల భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేసారు . అయితే, గతంలో సీజ్ చేసినట్లు చెబుతున్న ఈ భవనంలోని కొంత భాగాన్ని అధికారులు కూల్చివేసినప్పటికీ, ప్రస్తుతం మళ్లీ నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయన్న ఆరోపణలు స్థానికుల్లో అసంతృప్తిని పెంచుతున్నాయి. ఒకసారి సీజ్ చేసి, కూల్చివేత చర్యలు చేపట్టిన తర్వాత కూడా పనులు తిరిగి ప్రారంభమైతే వాటిని అడ్డుకోవాల్సిన



-మిగతా 5లో

యూపీలో 1.27 కోట్ల హిందువుల ఓట్లు గల్లంతు




02

నవంబర్‌లోనూ ఎండల తీవ్రత!

- చలి తీవ్రత పెరగాల్సిన సమయంలో భిన్న వాతావరణం
- దేశవ్యాప్తంగా సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం
- హిమాలయ పర్వత పాద ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు
- నవంబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు
- ఎల్‌నినో ప్రభావంతో కొనసాగనున్న భిన్న వాతావరణ పరిస్థితులు


02



నింగిలోకి నావిక్

- జీఎస్ఎల్వీ-ఎఫ్18 ద్వారా ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో
- భారత నావిగేషన్ వ్యవస్థ 'నావ్ఐసీ'కి మరింత బలం
- కనీస కార్యాచరణకు అవసరమైన నాలుగు ఉపగ్రహాల మైలురాయి పూర్తి
- 2,250 కిలోల బరువున్న ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టిన రాకెట్
- దేశీయంగా అభివృద్ధి చేసిన అణు గడియారం ఏర్పాటు
- ఎల్1 ఫ్రీక్వెన్సీతో పౌర నావిగేషన్ సేవలకు మరింత ప్రయోజనం
- భారత భూభాగంతోపాటు సరిహద్దులకు అవతల 1,500 కిలోమీటర్ల వరకు సేవలు
- కేవలం 56 రోజుల వ్యవధిలో మరో జీఎస్ఎల్వీ ప్రయోగం

02



తుది పోరుకు టీమిండియా సిద్ధం

- నేడు న్యూజిలాండ్‌తో ఐదో టీ20
- నాలుగో టీ20లో 87 పరుగుల తేడాతో భారత్‌కు పరాజయం
- క్లీన్‌స్వీప్ ఆశలకు బ్రేక్.. సిరీస్‌పై ఉత్కంఠ
- కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలలో ఒకరికి ఛాన్స్
- భువనేశ్వర్ కుమార్‌ను తీసుకొచ్చే యోచన
- విజయంతో సిరీస్‌ను ముగించాలని ఇరు జట్ల పట్టుదల

02





02

వైమానిక దళ చీఫ్‌గా

అశుతోష్ దీక్షిత్

- అమర్ ప్రీత్ సింగ్ పదవీ విరమణతో బాధ్యతల స్వీకరణ
- 1986లో వాయుసేనలో చేరిన దీక్షిత్
- నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సేవా అనుభవం
- దాదాపు 20 రకాల యుద్ధ విమానాలను నడిపిన నైపుణ్యం
- మిరాజ్-2000, మిగ్, జాగ్వార్, తేజస్ విమానాలపై పట్టు
- 3,500 గంటలకు పైగా విమానయానం చేసిన అనుభవం
- ఆపరేషన్ సఫేద్ సాగర్, రక్షక్, సిందూర్‌లో కీలక సేవలు
- వ్యూహాత్మక ప్రణాళికల్లో ప్రత్యేక గుర్తింపు

జ్ఞానేశ్ దేశద్రోహి!

- సీఈసీని పదవి నుంచి తొలగించాలని ఇండియా కూటమి డిమాండ్
- ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవహరించారని ఆరోపణ
- ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాల విమర్శ
- ఎస్ఐఆర్ పేరుతో 13.2 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారని ఆరోపణ
- ఫారం-6 నిబంధనల్లో అక్రమ మార్పులు చేశారని అభియోగం
- ఇతర ఎన్నికల కమిషనర్లను నిర్ణయాల ప్రక్రియకు దూరంగా ఉంచారని విమర్శ
- సీఈసీపై న్యాయస్థానంలో దేశద్రోహం అభియోగాల విచారణకు డిమాండ్
- ప్రతిపక్షాల ఆరోపణలను ఖండించిన బీజేపీ

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని ఇండియా కూటమి డిమాండ్ చేసింది. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవహరించారని ఆరోపిస్తూ, ఆయనపై దేశద్రోహం అభియోగాలపై విచారణ జరపాలని కోరింది. ఈ ఆరోపణలను బీజేపీ ఖండించింది.

02





అబద్దాల్లో రేవంత్‌కు ఆస్కార్ ఇవ్వొచ్చు!

- మియాపూర్ భూములపై సీఎం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు
- బీఆర్ఎస్‌పై విమర్శలు.. హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం
- అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా రేవంత్ నిలిచిపోతారు
- సుప్రీంకోర్టు తీర్పుతో ప్రభుత్వానికి భూములపై హక్కులు
- తీర్పు కాపీ రాకముందే భూముల అమ్మకంపై ఆతృత ఎందుకని ప్రశ్న
- కేసీఆర్ హయాంలో న్యాయపోరాటంతో భూములు కాపాడాం
- మంచిరేవుల భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే యత్నం
- సెంట్రల్ యూనివర్సిటీ భూములను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్ల అప్పు

హైదరాబాద్

మియాపూర్ భూముల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అబద్దాలకు రేవంత్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిపోతారని, ఆయనకు అబద్దాల్లో ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని ఎద్దేవా చేశారు. మియాపూర్ భూములు తెలంగాణ ప్రభుత్వానికే చెందుతాయని సుప్రీంకోర్టు వెల్లడించిన నేపథ్యంలో సీఎం చేసిన వ్యాఖ్యలను

-మిగతా 2 లో

వార్తసంధ్య
www.vaarthasandhya.com

నింగిలోకి నావిక్



న్యూఢిల్లీ
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో కీలక విజయాన్ని సాధించింది. దేశీయ నావిగేషన్ వ్యవస్థ 'నావ్‌ఐసీ'ని బలోపేతం చేసే లక్ష్యంతో చేపట్టిన ఎన్‌వీఎస్-03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి శుక్రవారం రాత్రి 11.51 గంటలకు జీఎస్ఎల్‌వీ-ఎఫ్18 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగం జరిగిన సుమారు 20 నిమిషాల తర్వాత 2,250 కిలోల బరువున్న ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని రాకెట్ నిర్దేశిత జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. రాకెట్‌లోని అన్ని వ్యవస్థలు సమర్థంగా పనిచేశాయని, ఉపగ్రహం ఆరోగ్యంగా ఉందని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ధ్రువీకరించారు. ఈ ప్రయోగంతో 'నావ్‌ఐసీ' వ్యవస్థ సమర్థంగా పనిచేయడానికి అవసరమైన కనీసం నాలుగు ఉపగ్రహాల మైలురాయిని ఇస్రో చేరుకుంది. ఉపగ్రహంలో దేశీయంగా అభివృద్ధి చేసిన అణు గడియారాన్ని అమర్చడం ప్రత్యేకతగా నిలిచింది. ఇప్పటికే ఉన్న ఎల్5, ఎస్-బ్యాండ్ సిగ్నల్లతోపాటు కొత్తగా ఎల్1 ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌లోనూ ఇది సంకేతాలను ప్రసారం చేయనుంది. దీంతో స్థాననిర్ణయం, నావిగేషన్, సమయ నిర్ధారణ (పీఎన్‌టీ) సేవలు మరింత బలోపేతం కానున్నాయి. భారత భూభాగంతోపాటు దేశ సరిహద్దుల నుంచి 1,500 కిలోమీటర్ల వరకు ఈ వ్యవస్థ సేవలు అందించనుంది. గతంలో తొలి తరం ఉపగ్రహాల జీవితకాలం ముగియడం, అణు గడియారాల్లో సమస్యలు తలెత్తడం, ఎన్‌వీఎస్-02 ఉపగ్రహం ప్రొపల్షన్ సమస్యతో ఆశించిన విధంగా పనిచేయకపోవడం వంటి సవాళ్లు ఎదురయ్యాయి. వాటి నేపథ్యంలో ఎన్‌వీఎస్-03 ప్రయోగం విజయవంతం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. కేవలం 56 రోజుల వ్యవధిలోనే మరో జీఎస్ఎల్‌వీ ప్రయోగాన్ని నిర్వహించడం ఇస్రో ప్రయోగ సామర్థ్యాన్ని చాటుతోంది. ప్రస్తుతం ఉపగ్రహం తనలోని ఇంజిన్ల సాయంతో తదుపరి కక్ష్య పెంపు విన్యాసాలను చేపట్టనుంది. అనంతరం తుది పరీక్షలు పూర్తయ్యాక నావ్‌ఐసీ వ్యవస్థలో సేవలు అందించడం ప్రారంభిస్తుంది. రహదారి, సముద్ర నావిగేషన్, విపత్తుల నిర్వహణ, వ్యవసాయం వంటి పౌర అవసరాలతోపాటు సైనిక, వ్యూహాత్మక అవసరాలకు కూడా ఈ వ్యవస్థ కీలకంగా మారనుంది. దేశీయ నావిగేషన్ సేవలపై స్వావలంబనను పెంచడంలో ఎన్‌వీఎస్-03 ప్రయోగం మరో ముందడుగుగా నిలిచింది.

వైమానిక దళ చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్



న్యూఢిల్లీ:
భారత వైమానిక దళం (ఐఏఎఫ్) అధిపతిగా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈ పదవిలో కొనసాగిన ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ శనివారం పదవీ విరమణ చేయడంతో దీక్షిత్ బాధ్యతలు చేపట్టారు. యుద్ధ విమానాలను నడపడంలో విశేష అనుభవం, వ్యూహాత్మక ప్రణాళికల్లో నైపుణ్యం ఉన్న ఆయనకు వాయుసేనలో సుదీర్ఘ సేవా నేపథ్యం ఉంది.1966 డిసెంబర్ 9న జన్మించిన అశుతోష్ దీక్షిత్ 1986 డిసెంబర్ 6న భారత వైమానిక దళంలో చేరారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా వివిధ హోదాల్లో పనిచేస్తూ అనేక కీలక బాధ్యతలు నిర్వర్తించారు. మిరాజ్-2000, కిరణ్, మిగ్, జాగ్వార్, తేజస్ వంటి యుద్ధ విమానాలను నడిపిన అనుభవం ఆయనకు ఉంది. మొత్తం 3,500 గంటలకు పైగా విమానయానం చేసిన ఆయన, దాదాపు 20 రకాల యుద్ధ విమానాలను నడిపిన నైపుణ్యాన్ని సొంతం చేసుకున్నారు. దేశ రక్షణకు సంబంధించిన పలు కీలక సైనిక కార్యకలాపాల్లోనూ దీక్షిత్ భాగస్వామిగా ఉన్నారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, ఆపరేషన్ సింధూర్ వంటి ఆపరేషన్లలో సేవలందించారు. ముఖ్యంగా ఆపరేషన్ సింధూర్ సమయంలో వ్యూహాత్మక ప్రణాళికల్లో కీలక పాత్ర పోషించినట్లు ఆయనకు గుర్తింపు ఉంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, 2028 డిసెంబర్ 31 వరకు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు.


అబద్ధాల్లో రేవంత్‌కు ఆస్కార్ ఇవ్వొచ్చు!

మొదటి తరువాయి

హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. అబద్ధాలు చెబుతూ క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు కాపీ కూడా అందకముందే మియాపూర్ భూములను విక్రయించాలనే ఆతృత ముఖ్యమంత్రిలో కనిపించిందని హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌ను నియమించి, భూములు ప్రభుత్వానికి దక్కేలా న్యాయపోరాటం చేశామని గుర్తుచేశారు. ఆ పోరాటం ద్వారానే ప్రభుత్వ భూములను కాపాడగలిగామని పేర్కొన్నారు. మంచిరేవులలో 142 ఎకరాల భూములను కాపాడినట్లు గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. అదే భూముల్లోని 10 ఎకరాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నించిందని హరీశ్‌రావు ఆరోపించారు. భూపాలపల్లి, హయత్‌నగర్ ప్రాంతాల్లోని భూములను కాపాడేందుకు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేసిందని తెలిపారు. మరోవైపు, సెంట్రల్ యూనివర్సిటీ భూములను తాకట్టు పెట్టి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.10 వేల కోట్ల అప్పు తెచ్చుకుందని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ప్రశ్నిస్తూ, బీఆర్ఎస్‌పై చేస్తున్న ఆరోపణలకు ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

నవంబర్‌లోనూ ఎండల తీవ్రత!

న్యూఢిల్లీ
దేశంలో చలి తీవ్రత పెరగాల్సిన నవంబర్‌లోనూ ఎండలు మండిపోనున్నాయి. దేశంలో చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. హిమాలయ పర్వత పాద ప్రాంతాల్లో మాత్రం సాధారణ లేదా అంతకంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తన నెలవారీ నివేదికలో తెలిపింది. అయితే మధ్య, తూర్పు భారతదేశంలోని పలు ప్రాంతాల్లో సాధారణం లేదా అంతకంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.నవంబర్‌లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ అంచనా వేసింది. మధ్య, వాయవ్య, ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం నుంచి అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా నవంబర్‌లో దీర్ఘకాలిక సగటు వర్షపాతం(ఎల్‌పీఏ)లో 77 శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉంది. మరోవైపు పసిఫిక్ మహా సముద్రంలో ప్రస్తుతం అత్యంత బలమైన ఎల్‌నినో పరిస్థితులు కొనసాగుతున్నాయి. నవంబర్, డిసెంబర్ నెలల్లోనూ ఇవి కొనసాగవచ్చని వాతావరణ నమూనాలు సూచిస్తున్నాయి.



యూపీలో 1.27 కోట్ల హిందువుల ఓట్లు గల్లంతు

లక్నో: ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సమీక్ష(సర్) ప్రక్రియలో బీజేపీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాల నుంచి కోట్లాది మంది హిందువుల పేర్లు తొలగిపోయాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పార్టీ కార్యకర్తలనుద్దేశించి యోగి మాట్లాడుతూ ఓటర్ల జాబితాల నుంచి రాష్ట్రంలో 1.27 కోట్ల మంది హిందువుల పేర్లు గల్లంతయ్యాయన్నారు. అర్హులైన ఓటర్లందరూ జాబితాలో చేరేలా చూడాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఈ తొలగింపులు 28 స్థానిక సంస్థ నియోజకవర్గాల్లో పార్టీ స్థానాన్ని బలహీనపరుస్తున్నాయని ఆయన తెలిపారు.

తుది పోరుకు టీమిండియా సిద్ధం

-నేడు న్యూజిలాండ్‌తో ఐదో టీ20
-నాలుగో టీ20లో 87 పరుగుల తేడాతో భారత్‌కు పరాజయం
-క్లీన్‌స్వీప్ ఆశలకు బ్రేక్.. సిరీస్‌పై ఉత్కంఠ
-కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలలో ఒకరికి ఛాన్స్
-భువనేశ్వర్ కుమార్‌ను తీసుకొచ్చే యోచన
-విజయంతో సిరీస్‌ను ముగించాలని ఇరు జట్ల పట్టుదల

హామిల్టన్: న్యూజిలాండ్ పర్యటనలో వరుస విజయాలతో దూసుకెళ్తున్న టీమిండియాకు నాలుగో టీ20లో ఎదురుదెబ్బ తగిలింది. వెల్లింగ్టన్ వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు సమష్టిగా రాణించి భారత్‌పై 87 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేసింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో క్లీన్‌స్వీప్ చేయాలన్న భారత ఆశలకు బ్రేక్ పడింది. మరోవైపు ఈ విజయంతో న్యూజిలాండ్ సిరీస్‌లో పుంజుకుంది. ఈ నేపథ్యంలో ఆదివారం జరగనున్న ఐదో, చివరి టీ20పై ఆసక్తి నెలకొంది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను



విజయంతో ముగించడంతోపాటు, వన్డే సిరీస్‌కు ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని భారత్ భావిస్తోంది. అటు నాలుగో టీ20లో సాధించిన విజయాన్ని కొనసాగించి సిరీస్‌ను 3--2తో ముగించాలని న్యూజిలాండ్ పట్టుదలతో ఉంది. నాలుగో టీ20లో ఎదురైన పరాజయంతో భారత జట్టు మేనేజ్‌మెంట్ తుది జట్టు కూర్పుపై దృష్టి సారించే అవకాశం ఉంది. ముఖ్యంగా బౌలింగ్ విభాగంలో మార్పులు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఆఖరి మ్యాచ్‌లో స్పెషలిస్ట్ స్పిన్నర్‌ను ఆడించాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలలో ఒకరికి తుది జట్టులో అవకాశం దక్కవచ్చు. అదే జరిగితే ఆల్‌రౌండర్ నీతీశ్ కుమార్ రెడ్డిని బెంచ్‌కు పరిమితం చేసే అవకాశముంది. మరోవైపు అనుభవజ్ఞుడైన పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను తిరిగి జట్టులోకి తీసుకురావాలని కూడా యోచిస్తున్నట్లు సమాచారం. అతడికి అవకాశం దక్కితే యువ పేసర్ మయాంక్ యాదవ్ తుది జట్టులో చోటు కోల్పోవచ్చు. అయితే బ్యాటింగ్ విభాగంలో మాత్రం పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని తెలుస్తోంది. ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ బరిలోకి దిగే అవకాశం ఉంది. మూడో స్థానంలో ఇషాన్ కిషన్, ఆ తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మిడిలార్డర్‌లో నమన్ ధీర్, అక్షర్ పటేల్ తమ స్థానాల్లో కొనసాగవచ్చు. బౌలింగ్ విభాగంలో అర్ష్‌దీప్ సింగ్, భువనేశ్వర్ కుమార్, ప్రిన్స్ యాదవ్ పేస్ బాధ్యతలు పంచుకునే అవకాశం ఉంది. మయాంక్ యాదవ్‌ను కొనసాగించాలని నిర్ణయిస్తే అర్ష్‌దీప్ సింగ్‌కు విశ్రాంతి ఇచ్చే అవకాశమూ లేకపోలేదు. పిచ్ పరిస్థితులు, బౌలర్ల ఫిట్‌నెస్‌ను పరిగణనలోకి తీసుకుని తుది జట్టును ఎంపిక చేయనున్నారు. చివరి మ్యాచ్‌లో సమష్టిగా రాణించి విజయంతో పర్యటనను ముగించడమే భారత్ లక్ష్యంగా కనిపిస్తోంది.

జ్ఞానేశ్ దేశద్రోహి!

-సీఈసీని పదవి నుంచి తొలగించాలని ఇండియా కూటమి డిమాండ్
-ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవహరించారని ఆరోపణ
-ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాల విమర్శ
-ఎస్ఐఆర్ పేరుతో 13.2 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారని ఆరోపణ
-ఫారం-6 నిబంధనల్లో అక్రమ మార్పులు చేశారని అభియోగం
-ఇతర ఎన్నికల కమిషనర్లను నిర్ణయాల ప్రక్రియకు దూరంగా ఉంచారని విమర్శ
-సీఈసీపై న్యాయస్థానంలో దేశద్రోహం అభియోగాల విచారణకు డిమాండ్
-ప్రతిపక్షాల ఆరోపణలను ఖండించిన బీజేపీ

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై ఇండియా కూటమి తీవ్ర ఆరోపణలు చేసింది. బీజేపీకి అనుకూలంగా జాతీయ, రాష్ట్ర ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే కుట్రలో ఆయన భాగస్వామిగా వ్యవహరించారని ఆరోపిస్తూ, సీఈసీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. ఆయనపై దేశద్రోహం అభియోగాలపై న్యాయస్థానంలో విచారణ జరపాలని కోరింది. ఎన్నికల అక్రమాలు, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో అక్టోబర్ 31న న్యూఢిల్లీలో నిర్వహించిన ప్రతీకాత్మక ప్రజా అభిశంసన కార్యక్రమంలో ఈ మేరకు తీర్మానం ఆమోదించినట్లు ప్రకటించాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ తీర్మానాన్ని చదివి వినిపించారు. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేందుకు ఓటర్ల జాబితాలను తమకు అనుకూలంగా మార్చుకునే అవకాశం కల్పించారని ఇండియా కూటమి ఆరోపించింది. అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించడం, కొత్త పేర్లను చేర్చడం ద్వారా ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపేలా వ్యవహరించారని విమర్శించింది. ఈ చర్యలు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి విరుద్ధమని



పేర్కొంది. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసేలా సీఈసీ వ్యవహరించారని ఆరోపించింది. ఎస్ఐఆర్ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా, పక్షపాత ధోరణితో, పారదర్శకత లేకుండా నిర్వహించారని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఈ ప్రక్రియలో 13.2 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించారని, తద్వారా వారి రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కుకు భంగం కలిగిందని తీర్మానంలో పేర్కొన్నాయి. అయితే, ఈ సంఖ్యతో పాటు ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం-6లో పార్లమెంటు పర్యవేక్షణ లేకుండా మార్పులు చేశారని ఇండియా కూటమి ఆరోపించింది. తొలిసారి ఓటర్లుగా నమోదు కావాల్సిన యువతకు ఇబ్బందులు కలిగించేలా ఈ మార్పులు ఉన్నాయని పేర్కొంది. ఓటర్ల జాబితాల నిర్వహణ అధికారాలను కేంద్రీకరించడంతోపాటు, అర్హులైన కొత్త ఓటర్ల పేర్ల నమోదు ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని విమర్శించింది. ఈవీఎంల సాఫ్ట్‌వేర్ దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలను కూడా తీర్మానంలో ప్రస్తావించింది. ఎన్నికల కమిషన్‌లోని మరో ఇద్దరు కమిషనర్లను నిర్ణయాలు తీసుకునే ప్రక్రియ నుంచి ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టారని ప్రతిపక్ష కూటమి ఆరోపించింది. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్న రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించింది. అలాగే, బీజేపీకి అనుకూలంగా వ్యవహరించినందుకు సీఈసీ కుటుంబ సభ్యులకు పదవులు, ఆర్థిక ప్రయోజనాలు కల్పించారన్న ఆరోపణలూ చేసింది. ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్రంగా నిర్ధారించే ఆధారాలను మాత్రం తీర్మానం వివరించలేదు. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఆయనపై చేసిన ఆరోపణలపై చట్టప్రకారం విచారణ జరపాలని ఇండియా కూటమి డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమానికి మాజీ లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్ అధ్యక్షత వహించారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్‌తో పాటు సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ తదితర పార్టీల నాయకులు, ఎంపీలు పాల్గొన్నారు. ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన ఇండియా కూటమి భారీ ర్యాలీకి ముందు ఈ కార్యక్రమం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, ఎన్నికల అక్రమాలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను బీజేపీ ఖండించింది. ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందడంలో విఫలమైన ప్రతిపక్షాలు రాజ్యాంగ సంస్థలపై దాడులకు దిగుతున్నాయని విమర్శించింది. రాజకీయంగా ఎదుర్కోలేక ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేస్తున్నాయని ఎద్దేవా చేసింది. దీంతో సీఈసీపై ప్రతిపక్షాల ఆరోపణలు, బీజేపీ ఖండనతో దేశ రాజకీయాల్లో మరోసారి వాదోపవాదాలు తీవ్రతరమయ్యాయి.

హైదరాబాద్ వేదికగా ఢీ అంటే ఢీ!

హైదరాబాద్,
తెలంగాణ రాజకీయాలు మరోసారి వేడెక్కుతున్నాయి. ఓటు చోరీ ఆరోపణలతో కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న వేళ.. భాగ్యనగరం వేదికగా బలప్రదర్శనకు కమలనాథులు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో.. దానికి కౌంటర్‌గా హైదరాబాద్‌లో భారీ పాదయాత్ర, బహిరంగ సభ నిర్వహించేందుకు బీజేపీ కార్యాచరణ రూపొందించింది. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొననుండటంతో రాష్ట్ర రాజకీయాల్లో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. నవంబర్ 2న 'లోక్‌తంత్ర బచావో--అరాచకత్వ హఠావో' నినాదంతో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ద్వారా కాంగ్రెస్‌పై రాజకీయంగా ఎదురుదాడి చేయాలని బీజేపీ భావిస్తోంది. హైదరాబాద్‌లో భారీ స్థాయిలో పాదయాత్ర నిర్వహించి పార్టీ బలాన్ని చాటుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం లక్ష్యంగా పెట్టుకుంది. బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం నుంచి ఎంజే మార్కెట్ వరకు పాదయాత్ర కొనసాగనుంది. అనంతరం ఎంజే మార్కెట్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి లక్ష మందిని సమీకరించాలని పార్టీ నేతలు ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ శ్రేణులతోపాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, మేధావులు, యువతను కూడా కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని భావిస్తున్నారు. ఈ పాదయాత్రను పార్టీ అధిష్ఠానం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎనిమిది జిల్లాల నాయకులతో ఇప్పటికే సమావేశాలు నిర్వహించి జనసమీకరణపై దిశానిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్ర పార్టీ సహ ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్, సంస్థాగత సంయుక్త ప్రధాన కార్యదర్శి దశరథ్ హైదరాబాద్‌లోనే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు మార్గదర్శకాలు జారీ చేశారు. ర్యాలీ మార్గం, జనసమీకరణ, భద్రత, ఇతర ఏర్పాట్లపై నేతలు సమీక్షలు నిర్వహిస్తున్నారు. కేంద్ర హోంమంత్రి పర్యటన నేపథ్యంలో రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడం, మారుతున్న రాజకీయ పరిస్థితులను ఎదుర్కోవడం, భవిష్యత్ కార్యాచరణను రూపొందించడం వంటి అంశాలపై అమిత్ షా రాష్ట్ర ముఖ్య నేతలతో చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలను మరింత పదునుపెట్టడంతోపాటు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అధికారిక షెడ్యూల్ ప్రకారం నవంబర్ 2న మధ్యాహ్నం 2 గంటలకు అమిత్ షా బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి కాకతీయ హోటల్‌కు వెళ్లి సాయంత్రం 4 గంటల వరకు అక్కడే ఉంటారు. ఈ సమయంలో రాష్ట్రానికి చెందిన వివిధ రంగాల ప్రముఖులతో సమావేశమయ్యే అవకాశం ఉంది. అనంతరం పాదయాత్ర ప్రారంభమయ్యే ప్రాంతానికి చేరుకుంటారు. బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం నుంచి ఎంజే మార్కెట్ వరకు జరిగే 'లోక్‌తంత్ర బచావో--అరాచకత్వ హఠావో' పాదయాత్రలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటల నుంచి 5.30 గంటల మధ్య ఎంజే మార్కెట్ వద్ద నిర్వహించే కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు. కాంగ్రెస్, బీజేపీ మధ్య జాతీయ స్థాయిలో కొనసాగుతున్న రాజకీయ పోరుకు హైదరాబాద్ వేదికగా మరో కీలక ఘట్టం చోటుచేసుకోనుంది. అమిత్ షా పర్యటన, మహా పాదయాత్ర, బహిరంగ సభ ద్వారా రాష్ట్రంలో తమ రాజకీయ బలాన్ని చాటుకోవాలని బీజేపీ భావిస్తోంది. ఈ కార్యక్రమం తెలంగాణ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

నేడు ఢిల్లీలో ఇండియా కూటమి మెగా ర్యాలీ

న్యూఢిల్లీ
దేశ రాజధానిలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం జరగనున్న ఇండియా కూటమి మెగా ర్యాలీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై నిరసన తెలిపేందుకు, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలు ఢిల్లీకి చేరుకుంటున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మింటో రోడ్-కనాట్ ప్లేస్ కూడలి నుంచి 'చలో ఢిల్లీ' ప్రదర్శన ప్రారంభమై రామ్‌లీలా మైదానానికి చేరుకోనుంది. అనంతరం అక్కడ బహిరంగ సభ నిర్వహించనున్నారు. సభ కోసం భారీ వేదికలు, పందిళ్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్ సదుపాయాలు కల్పించారు. ర్యాలీకి 4 వేల మందికి పైగా పోలీసులతోపాటు కేంద్ర సాయుధ పోలీసు బలగాలను మోహరించనున్నారు. మైదానాన్ని 14 జోన్లుగా విభజించి, 200కు పైగా సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ర్యాలీకి పది లక్షల మంది వరకు హాజరవుతారని ఇండియా కూటమి నేతలు అంచనా వేస్తుండగా, సుమారు 50 వేల మంది వస్తారని పోలీసులు భావిస్తున్నారు. సభా ఏర్పాట్ల కారణంగా మైదానం సామర్థ్యం 30 వేల నుంచి 40 వేల మందికి పరిమితం కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో శనివారం నిర్వహించిన ప్రతీకాత్మక ప్రజా అభిశంసన కార్యక్రమానికి కొనసాగింపుగా ఈ ర్యాలీ జరగనుంది. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన జరిగిన ఆ కార్యక్రమంలో ఎన్నికల కమిషనర్‌పై ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలతో కూడిన తీర్మానాన్ని ఆమోదించారు.

ఓటు చోరీతో నెహ్రూ పీఎం అయ్యారు!

మొదటి తరువాయి

దేశానికి తొలి ప్రధానిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉండాలని పలువురు కోరుకున్నారని, ఆయనకు మద్దతు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ఓటు చోరీకి పాల్పడి నెహ్రూను ప్రధానిని చేసిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. పటేల్ తొలి ప్రధాని అయి ఉంటే దేశ పరిస్థితులు మరోలా ఉండేవని అభిప్రాయపడ్డారు. దేశంలోని 550 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో పటేల్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. సూర్యచంద్రులు ఉన్నంతకాలం పటేల్‌ను దేశ ప్రజలు మరచిపోరని అన్నారు. పటేల్ జయంతి వేడుకలను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. నిజాం పాలనలో ప్రజలపై అరాచకాలు జరుగుతున్న సమయంలో నెహ్రూ స్పందించలేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. నెహ్రూ లోపాయకారి ఒప్పందాలు, స్వార్థ రాజకీయ విధానాల కారణంగా సంస్థానాల విలీన ప్రక్రియలో తీవ్ర గందరగోళం ఏర్పడిందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న చర్యలతోనే జమ్మూ కశ్మీర్ ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు మాట్లాడుతూ యువత కాంగ్రెస్ కుటుంబ రాజకీయాలు, ఆ పార్టీ పాలనలో జరిగిన అవినీతి గురించి తెలుసుకోవాలని సూచించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో పటేల్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

:రైతుల డిజిటల్ రిజిస్ట్రేషన్
ప్రక్రియను వేగవంతం చేయాలి

:డీఆర్ఓ పద్మావతి



ఉమ్మడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, 31 అక్టోబర్ (వార్త సంధ్య)
జిల్లాలో అగ్రిస్టాక్ యాప్ ద్వారా చేపడుతున్న రైతు రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేసి వందశాతం లక్ష్యాన్ని సాధించాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో వివిధ శాఖల అధికారులతో కార్యక్రమం పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో డిజిటలైజేషన్‌లో భాగంగా అగ్రిస్టాక్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా భూమి కలిగిన ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య (ఫార్మర్ ఐడీ) కేటాయించేందుకు రైతు రిజిస్ట్రీ చేపట్టినట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 1.85 లక్షల మంది రైతులకు గాను ఇప్పటివరకు సుమారు 1.39 లక్షల మంది రైతుల రిజిస్ట్రేషన్ పూర్తయిందని, మరో 45 వేల మంది రైతుల నమోదు చేయాల్సి ఉందని తెలిపారు. మిగిలిన రైతులందరి వివరాలను నమోదు చేసి వందశాతం లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని శాఖలు సహకరించాలని కోరారు.అలాగే డిజిటల్ క్రాప్ బుకింగ్‌లో భాగంగా గ్రామస్థాయిలో వాలంటీర్లను గుర్తించి క్షేత్రస్థాయిలో పంటల ఫొటోలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పంటల సాగు విస్తీర్ణం, పంటల వివరాలు ఖచ్చితంగా నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన సమాచారం భవిష్యత్తులో వివిధ ప్రభుత్వ శాఖలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.డీఆర్ఓ పద్మావతి మాట్లాడుతూ, రైతు రిజిస్ట్రీ ద్వారా రూపొందే రైతుల సమగ్ర సమాచారం వ్యవసాయం, ఉద్యానవనం, మార్కెటింగ్, పౌరసరఫరాలు, బ్యాంకింగ్, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రైతులకు పంట రుణాలు, ఆర్థిక సేవలు అందించడం, ధాన్యం, మొక్కజొన్న, పత్తి తదితర పంటల కొనుగోలు, పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు పరిహారం అందించే ప్రక్రియలో ఫార్మర్ ఐడీ కీలకంగా ఉంటుందని వివరించారు.ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్‌పామ్ సాగు, డ్రిప్ ఇరిగేషన్ వంటి పథకాల అమలులో, డీఆర్డీఏ ద్వారా రైతులకు ఫామ్ పాండ్స్, ఇంకుడు గుంతలు, రీఛార్జ్ పిట్స్ వంటి సదుపాయాలు కల్పించే సమయంలో రైతు ఐడీని తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని రైతులకు ఫార్మర్ ఐడీ ప్రాధాన్యతను వివరించి రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్లు, మండల వ్యవసాయ కార్యాలయాల ద్వారా సులభంగా పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో రైతులు సమీప కేంద్రాల్లో నమోదు చేసుకోవచ్చని వివరించారు. మీసేవ, సీఎస్-సీ కేంద్రాలకు వచ్చే రైతులకు ఫార్మర్ ఐడీ నమోదు విషయంలో అవగాహన కల్పించి అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు.రైతు రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ బుకింగ్ కార్యక్రమాల విజయవంతమైన అమలుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని డీఆర్ఓ పద్మావతి సూచించారు.ఈ సమావేశంలో సీపి ఓ సునీత,లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి , ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వర రావు , ఉద్యానవన శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, పౌరసరఫరాలు, మార్కెటింగ్, ఐటీడీఏ, గిరిజన సంక్షేమం, నాబార్డ్, లీడ్ బ్యాంక్, పశుసంవర్ధక, సహకార, డీఆర్డీఏ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

:జాతి ఐక్యతకు పునాదులు వేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్
-జిల్లా కలెక్టర్ అంకిత్



ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, 31 అక్టోబర్ (వార్త సంధ్య)
సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఐడీఓసీ కార్యాలయంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ జాతీయ ఐక్యతా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఆర్ఓ పద్మావతితో కలిసి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రజలంతా బేధాభిప్రాయాలను విడనాడి జాతీయ ఐక్యతా భావంతో మెలగాలని సూచించారు. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ నుంచి మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి గొప్ప నాయకులు ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేశారని తెలిపారు. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం లభించిన అనంతరం సుమారు 500 సంస్థానాల విలీనం పెద్ద సవాలుగా మారిందని అన్నారు . ఆ సమయంలో ఎంతో చాకచక్యంగా వ్యవహరించిన భారత తొలి ఉప ప్రధాని, కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సంస్థానాల విలీనం కోసం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. తన దృఢ సంకల్పం, కార్యదక్షతతో సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి జాతీయ సమైక్యతకు బలమైన పునాదులు వేశారని కొనియాడారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన ఐక్యతా మార్గంలో దేశం ముందుకు సాగుతూ ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం, సమైక్యత కోసం జాతీయ నాయకులు చేసిన పోరాటాలు, త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, వారి స్ఫూర్తితో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జాతి మొత్తం ఐక్యత, సమగ్రత, సోదరభావంతో మెలగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిపిఓ సునీత, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, డీపీఓ అనూష, బీసీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, ఓఎస్డీ వెంకటరమణతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు.



సింగరేణి ప్రతినిధి అక్టోబర్ 31 (వార్తా సంధ్య)
సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్లలో ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జెండాలను ఆవిష్కరించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ పరిరక్షణతో పాటు కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు చేస్తోందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థను కాపాడుకోవడం, కార్మికుల సంక్షేమాన్ని పరిరక్షించడం లక్ష్యంగా సేవ్ సింగరేణి జాతా, హెడ్ ఆఫీస్ ముట్టడి, జెన్కో ముట్టడి వంటి కీలక ఉద్యమ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు.ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగా గుర్తింపు సంఘంగా కార్మికులకు ప్రయోజనం చేకూర్చే 24 కీలక ఒప్పందాలు కుదిరేలా కృషి చేశామని వెల్లడించారు. సొంత ఇంటి పథకం, పెర్క్‌పై పన్ను వంటి ముఖ్యమైన సమస్యల పరిష్కారానికి సంబంధించి కూడా ఒప్పందాలు సాధించామని తెలిపారు. ఈ ఒప్పందాలను క్షేత్రస్థాయిలో అమలు చేయించి కార్మికులకు పూర్తి ప్రయోజనాలు అందేలా చూడాల్సిన బాధ్యత తమపై ఉందని స్పష్టం చేశారు. కార్మికులకు దీపావళి బోనస్, లాభాల వాటా సాధించడంలో ఏఐటీయూసీ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఏఐటీయూసీ నిరంతర పోరాటాలు, కార్మికుల ఐక్య పోరాటాల ఫలితంగానే నేడు సింగరేణి కార్మికులు కార్మికులకు రావాల్సిన ప్రతి హక్కు, ప్రయోజనం అందే వరకు ఏఐటీయూసీ పోరాటం ఆగదని అన్నారు.కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడులను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. కార్మికులకు నష్టం కలిగించే విధానాలకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో కార్మిక సంఘాలను ఐక్యం చేస్తూ ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శి జక్కుల గట్టయ్య, ఉపాధ్యక్షులు కత్తర్ల రాములు, ఆఫీస్ బేరర్స్ ఎస్. నాగేశ్వరరావు, హుమాయూన్, హీరాలాల్,గుమ్మడి వీరయ్య,పిట్ కార్యదర్శులు భూక్యా రమేష్, మధుకృష్ణ, కమల్, మెంగన్ రవి,సురేందర్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి సాయి పవన్, నాయకులు సందీప్, సాంబమూర్తి, మురళి, రామచందర్, సురేందర్ రెడ్డి, శశివర్ధన్ రెడ్డి, సంజీవ్,గుమ్మడి మురళి, అప్పారావు,రాజేందర్,కరుణాకర్,కోటి,ప్రభాకర్,ఓదెలు,కుమారరావు, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఏరియా వర్క్‌షాప్ డీజీఎం నాగరాజు నాయక్‌కు ఘన సన్మానం!
-పదవీ విరమణ సందర్భంగా సత్కరించిన పీఎస్ఆర్ మండల యూత్ ప్రెసిడెంట్ జర్పల ధోని నాయక్




కారేపల్లి ప్రతినిధి, అక్టోబర్ 31 (వార్త సంధ్య):
సింగరేణి ఏరియా వర్క్‌షాప్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) నాగరాజు నాయక్ ఉద్యోగ బాధ్యతల నుంచి పదవీ విరమణ పొందిన సందర్భంగా ఆయనకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎస్ఆర్ మండల యూత్ ప్రెసిడెంట్ జర్పల ధోని నాయక్ నాగరాజు నాయక్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ధోని నాయక్ మాట్లాడుతూ.. నాగరాజు నాయక్ తన సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానంలో సింగరేణి సంస్థ అభివృద్ధికి, ఏరియా వర్క్‌షాప్ నిర్వహణలో ఎంతో నిబద్ధతతో, అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. ఆయన సేవలు ఉద్యోగులకు, యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఏరియా వర్క్‌షాప్ ఈఈ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి
-ఇతరుల ప్రాణాలు కాపాడడంలో ముందు ఉండాలి
-సెక్యూరిటీ అధికారి జాకీర్ హుస్సేన్



సింగరేణి ప్రతినిధి అక్టోబర్ 31 (వార్త సంధ్య)
ప్రతి ఒక్క సెక్యూరిటీ సిబ్బంది అంకితభావం, క్రమశిక్షణ ,నిబద్ధతతో సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సెక్యూరిటీ అధికారి ఎండి జాకీర్ హుస్సేన్ సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు. ఎస్ అండ్ పి సి సెక్యూరిటీ సిబ్బందికి నిర్వహించిన ఫస్ట్ ఎయిడ్ ,ఫైర్ ఫైటింగ్ శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా కొత్తగూడెం ట్రైనింగ్ సెంటర్ లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ప్రతి యూనిఫాం సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్‌పై పూర్తి స్థాయి అవగాహన అవసరమని, అందులో భాగంగా యస్ అండ్ పిసి విభాగములో ప్రతి సెక్యూరిటీ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్‌పై శిక్షణనివ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ వల్ల సెక్యూరిటీ సిబ్బంది పనితీరు గణనీయంగా మెరుగు పడిందని వారం రోజుల శిక్షణా కాలంలో ఫస్ట్ ఎయిడ్ ,ఫైర్ ఫైటింగ్‌లోని అన్ని అంశాలపై బోధించడం జరిగినదని, అందుకోసం మెయిన్ హాస్పిటల్, మైన్స్ రెస్క్యూ స్టేషన్, ,భద్రాద్రి కొత్తగూడెం ఫైర్ స్టేషన్ ల నుంచి ఫ్యాకల్టీని తీసుకోవడం జరిగిందన్నారు. ఫస్ట్ ఎయిడ్ పై అవగాహన ఉంటే మన తోటి వారు ఆపదలో ఉన్నప్పుడు డాక్టర్ వద్దకు తీసుకు వెళ్ళే లోపు వారి ప్రాణాలను కాపాడవచ్చు అని, పని ప్రదేశాలలో అగ్ని ప్రమాదం సంభవించినపుడు వాటిని నివారించి సింగరేణి ఆస్తులను పరిరక్షించగలమని, మెరుగైన వృత్తి నైపుణ్యంతో, క్రమశిక్షణతో, నీతినిజాయితీతో, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ సమాజాభివృద్ధికై సెక్యూరిటీ సిబ్బంది పాటుపడాలని తెలిపారు. శ్రీ జ్యోతి అనాథ వృద్ధుల శరణాలయ నిర్వాహకులకు సెక్యూరిటీ సిబ్బందిచే నిత్యావసర సరుకులను వితరణగా అందజేశారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన నా. రాంబాబు, జి. రంగారెడ్డి లకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్స్ట్రక్టర్ డి. నారాయణ రెడ్డి, కె.రాజనర్సు, జూనియర్ ఇన్స్ట్రక్టర్, ట్రైనింగ్ సిబ్బంది లు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు
ప్రక్రియ వేగవంతం చేయాలి
ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో ప్రక్రియ ప్రారంభించాలని జేఏసీ నాయకుల విజ్ఞప్తి



హైదరాబాద్ ప్రతినిధి (వార్తసంధ్య)అక్టోబర్ 31
తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమ ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు కోరారు. శనివారం తార్నాకలోని ప్రొఫెసర్ కోదండరాం నివాసంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు ప్రొ. కోదండరాం, మోతే శోభన్ రెడ్డిని జేఏసీ నాయకులు, ఉద్యమకారులు కలిసి తమ సమస్యలను వివరించారు. తెలంగాణ ఉద్యమంలో అనేక విధాలుగా నష్టపోయిన ఉద్యమకారులు ప్రభుత్వ గుర్తింపు, సంక్షేమ పథకాల కోసం చాలాకాలంగా ఎదురుచూస్తున్నారని వారు తెలిపారు. గుర్తింపు ప్రక్రియ నత్తనడకన సాగుతుండటంతో పలువురు ఉద్యమకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికే కొంతమంది సీనియర్ ఉద్యమకారులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించి, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల ద్వారా వేగవంతం చేయాలని కోరారు. అలాగే తెలంగాణ ఉద్యమకారులపై నేటికీ కొనసాగుతున్న కేసులతో పాటు గత ప్రభుత్వం నమోదు చేసిన ఉద్యమ కేసులను కూడా ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర, వారి త్యాగం వెలకట్టలేనిదని పేర్కొంటూ, ఉద్యమ సమయంలో విద్యకు, ఉద్యోగాలకు దూరమైన విద్యార్థులకు సూపర్‌న్యూమరరీ కోటా లేదా ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రొ. కోదండరాం మాట్లాడుతూ ఉద్యమకారుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఒక వారం నుంచి పది రోజుల్లో వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించే ప్రయత్నం జరుగుతోందని, డిసెంబర్ 9లోగా ఉద్యమకారులకు గుర్తింపు కార్డులతో పాటు ఇతర హామీల అమలుకు చర్యలు తీసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కూడా ఈ అంశంపై సానుకూలంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీయూజేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రపుల్ రామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కల్లపు చంద్రన్న ప్రసాద్, అధికార ప్రతినిధి కంచర్ల బద్రి, 1969 ఉద్యమకారులు రంగారెడ్డి, శంకర్రావు, అంతారి హరి ప్రసాద్ గౌడ్, పాండు గౌడ్, దుండిగాల అంజయ్య, కన్నం యాదగిరి, హరినాథ్ బాబు, రాజు, బుచ్చిగారి భాస్కర్, నరసయ్య, పుట్ట రంజిత్, ఎన్. శంకర్, బి. వేణుగోపాల్, కర్ణయ్య, బి. రాజు, రాము, ఏ. సంపత్ తదితరులతో పాటు మహిళా ఉద్యమకారులు బాకారం లావణ్య, సుజీ, పుష్ప, అంజలి కుమారి, రాణి, డి. లలిత, టి. పద్మ, ఏ. కవిత, లలితమ్మ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 1 నుంచి 9 వరకు అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించండి

-భూమి, భుక్తి, విముక్తి కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు విప్లవ జోహార్లు

-సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు



కారేపల్లి ప్రతినిధి, అక్టోబర్ 31 (వార్త సంధ్య):
భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడి ప్రాణాలర్పించిన కమ్యూనిస్టు విప్లవ అమరవీరుల సంస్మరణ సభలను నవంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. భారత విప్లవోద్యమంలో అసువులు బాసిన అగ్రశ్రేణి నాయకులు, కార్యకర్తల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పార్టీ పేర్కొంది. ఈ సందర్భంగా నక్సల్బరీ ఉద్యమం భారత విప్లవోద్యమంలో కీలక మలుపుగా నిలిచిందని, వ్యవసాయ విప్లవం, దున్నేవాడికే భూమి అనే నినాదాలతో ప్రజా ఉద్యమాలకు దిశానిర్దేశం చేసిందని పార్టీ తన ప్రకటనలో వివరించింది. మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానాన్ని మార్గదర్శకంగా స్వీకరించి నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంతో ఉద్యమం కొనసాగిందని పేర్కొంది. దేశంలో నిరుద్యోగం, పేదరికం, ఆకలి చావులు, రైతుల ఆత్మహత్యలు, ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు సంక్షోభంలో ఉన్నాయని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణతో పాటు దేశ సంపద, ఖనిజ వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించింది. ఆదివాసీల హక్కులకు భంగం కలిగించే విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరి లోయ పోరాటాల చరిత్రను ప్రస్తావిస్తూ, ప్రజా సమస్యలపై ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని పార్టీ పిలుపునిచ్చింది. ప్రజల హక్కులు, జీవనోపాధి, భూమి సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాలను బలోపేతం చేయాలని పేర్కొంది. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నవంబర్ 1 నుంచి 9 వరకు అన్ని ప్రాంతాల్లో సంస్మరణ సభలు నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కారేపల్లి--కామేపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి శివ నాయక్ ఒక ప్రకటనలో కోరారు.

ఇంటింటికీ తిరుగుతూ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

-అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలి

-మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు



కారేపల్లి ప్రతినిధి, అక్టోబర్ 31 (వార్త సంధ్య):
ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు కోరారు. ఈ మేరకు భాగ్యనగర్ తండా గ్రామంలో సర్పంచ్ బానోత్ హీరాలాల్‌తో కలిసి ఆయన ఇంటింటికీ తిరుగుతూ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోటకూరి రాంబాబు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు సమీపిస్తున్నందున అర్హులైన పట్టభద్రులందరూ సకాలంలో తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డికి మద్దతు తెలుపుతూ, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, ప్రజా ప్రభుత్వానికి ఆశీర్వాదం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుగులోత్ భీముడు నాయక్, మండల పార్టీ సమన్వయకర్త వాంకుడోత్ గాంధీ, ఐఎన్‌టీయూసీ నాయకులు లావు డ్యాఈర్య, బీఎల్‌ఏ గుగులోత్ ప్రసాద్, నాయకులు వాంకుడోత్ రాంబాబు, కోఆర్డినేటర్ దారావత్ యేసు, దాస్య, బన్సీ, సామ్య తదితరులు పాల్గొన్నారు.

పివికే-5 గనిలో దేవి శరన్నవరాత్రి వేడుకలు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని



సింగరేణి ప్రతినిధి అక్టోబర్ 31 (వార్తా సంధ్య)
పివికే-5 గనిలో శనివారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిప్రపత్తులతో వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. ముందుగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు .అమ్మవారి ఆశీస్సులతో కార్మికులు, కార్మిక కుటుంబలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు.ఈ వేడుకల్లో సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి షబీర్ పాషా,కొత్తగూడెం నగరపాలక మేయర్ మూడ్ గణేష్ యూనియన్ నాయకులు గని అధికారులు, కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో 'జాతీయ ఐక్యతా దినోత్సవం'

-పటేల్ కృషి వల్లనే సమగ్ర భారత దేశం

-సింగరేణి డైరెక్టర్ లు: ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు



సింగరేణి ప్రతినిధి అక్టోబర్ 31 (వార్తా సంధ్య)
కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భారత దేశ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ రంగ సంస్థలలో ఉక్కుమనిషి, స్వతంత్ర భారత తొలి ఓం శాఖా మంత్రి భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినం సందర్భంగా నిర్వహించే జాతీయ ఐక్యతా దినోత్సవం సింగరేణి ప్రధాన కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఆర్‌డి కాన్ఫరెన్స్ హాల్ లో జిఎం(పర్సనల్) ఐఆర్ ఉ పిఎం జి.వి.కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ , డైరక్టర్(పిడపి) కె. వెంకటేశ్వర్లులు మాట్లాడారు. 2014 నుండి ప్రతీ సంవత్సరం అక్టోబర్ 31 న వల్లభాయ్ పటేల్ జయంతి నిర్వహించుకోవడం హర్షనీయమన్నారు. కార్పొరేట్ కార్యాలయం లోనే కాకుండా సింగరేణి వ్యాప్తముగా జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. స్వాతంత్రం రాక ముందు దేశం అనేక సంస్థానాలుగా ఉండేదని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి వల్లనే స్వాతంత్ర్యానంతరం అన్ని సంస్థానాల విలీనం జరిగి సమగ్ర భారత దేశం అవతరించిందని అన్నారు. ఐకమత్యంతో జాతి మత విభేదాలు లేకుండా ఉంటే ఏదైనా సాధించవచ్చని,రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకోవటంతో పాటు అభివృద్ధి పధం వైపు నడిపించటమే ఈ జాతీయ ఐక్యతా దినోత్సవ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. పటేల్ జయంతి సంధర్భముగా ప్రతీ ఏడాది దేశ వ్యాప్తముగా విజిలెన్స్ అవగాహనా కార్యక్రమాలను కూడా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. పటేల్ స్ఫూర్తి తో అన్నీ కార్మిక సంఘాలు, అధికారులు, కార్మికులు ఒకే కుటుంబంల పని చేసినట్లయితే సంస్థ కూడా రక్షణతో కూడిన ఉత్పత్తి , ఉత్పాదకతను పెంచుకోవడమే కాకుండా లాభాల బాటలో పయనిస్తుందన్నారు. అనంతరం పటేల్ చిత్రపటానికి ముఖ్య అతిథులు, జనరల్ మేనేజర్లు,శాఖాధిపతులు, అధికారులు ఉద్యోగులు పూలమాలలతో నివాళులు అర్పించారు.అనంతరం డివై.పిఎం కే.శివ కుమార్ సమగ్రతా ప్రతిజ్ఞ ను ఉద్యోగులతో చేయించారు. ఈ కార్యక్రమములో ఏఐటిరయూసి బ్రాంచ్ సెక్రెటరీ ఎస్.వి.రమణ మూర్తి,ఐఎన్‌టియూసి కార్పొరేట్ పిట్ సెక్రెటరీ ఆర్.సంజీత్, కార్పొరేట్ సిఎంఓఏఐ ప్రతినిధి హరి ప్రసాద్, కార్పోరేట్ లోని వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, డిజిఎం(పర్సనల్) బి.శివ కేశవ రావు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

డిసెంబరు 9న చలో హైదరాబాద్‌కు తుడుం దెబ్బ పిలుపు

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 31.
సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రెస్మీట్ జరిగింది ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ ప్రాంతాన్ని ఆగం చేస్తున్న తెలంగాణ పాలకులని ఆరోపించారు బుర్రల్లో నీళ్లు అంబలి సాధ్యకట్టుకొని డోలి మిమ్ములతో మన తరాలకు బ్రతుకు కోసం లక్షలాదిగా తరలిరావాలని ఆయన ఆదివాసులకు విజ్ఞప్తి చేశారు అక్రమంగా 50 ఏళ్లుగా ఎస్టీ జాబితా లంబాడీలు పట్టించుకోని పాలకులు రాజకీయ పార్టీలు కూడా పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు ఆదివాసులు న్యాయం జరగాలంటే లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు ఐదో షెడ్యూల్ ప్రాంతంలో నేటి తెలంగాణ కి కరెంటు ఉత్పత్తి చేసి కేటీపీఎస్ 54,000 మెగావాట్ల విద్యుత్ చేయడంతో పాటు 18 కోట్ల పద్దెనిమిది కోట్ల సంవత్సరాల ఆదాయం వస్తుందని ఆయన చెప్పారు మెగావాట్ల విద్యుత్తు 1500 ఉద్యోగాలు సంవత్సర ఆదాయం 12 వేల కోట్లు భద్రాచలం పేపర్ బోర్డు 36 రెండు సున్నాలు ఉద్యోగాలు సంవత్సర ఆదాయం 3600 ఉద్యోగాలు సంవత్సర ఆదాయం 2200 కోట్లు నా భారత్ పాల్వంచ 2700 ఉద్యోగాలు సంవత్సర ఆదాయం 24 వేల కోట్లు దేవపూర్ సిమెంట్ ఫ్యాక్టరీ 27 ఉద్యోగాలు సంవత్సర ఆదాయం 14000 కోట్లు ఈ కంపెనీలు ఫ్యాక్టరీలు అన్ని ఐదవ షెడ్యూల్



ప్రాంతంలో ఉన్నవి ఇవి ఉద్యోగాలు ఆదివాసులకు లేవు నిబంధన ప్రకారం నిధులు ఆదివాసుల అభివృద్ధి కోసం ఖర్చు చేయాలని ఉంది వాటిని అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు గోదావరి ఇసుక సంవత్సర ఆదాయం 1200 కోట్లు కానీ సింగరేణి ఆదాయం 48 వేల కోట్లు 42 వేల ఉద్యోగాలు ఉన్నాయి కానీ ఓపెన్ కాస్ట్ బొగ్గు దుమ్ములో ఆదివాసులు గూడెలు పెరుగు మగ్గుతున్నాయి అనేక గ్రామాలు నిర్వాసితమై ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారు అక్రమంగా 50 ఏళ్లుగా ఎస్టీ జాబితాలో లంబాడీలు పట్టించుకోని పాలకులు రాజకీయ పార్టీలు కూడా పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు తెలంగాణ 37 మెడికల్ కాలేజీలు సంవత్సరానికి 10 శాతం రిజర్వేషన్ ఒక సంవత్సరం ఆడికి 10 70 సీట్లు ఎస్టేట్ కూడా వస్తే పది సంవత్సరాల కాలంలో పదివేల సీట్లు ఎంబిబిఎస్ 10% రిజర్వేషన్లు అమలు చేయలేదని ఆయన ఆరోపించారు ఆదివాసీలపై అడవి శాఖ అధికారులు దురాగతాలు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు టైగర్ రిజర్వ్ పేరిట ఆదివాసులు ఆగం చేస్తున్నారని అడవిశాఖ అధికారులు తమ గౌడ్ పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు నాన్ షెడ్యూల్ గ్రామాలు షెడ్యూల్ గ్రామాలు గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు సమస్య పరిష్కరించకుంటే ప్రత్యేక గుండు గుండు వాన రాష్ట్ర డిమాండ్ మొదలుపెడతామని ఆయన చెప్పారు ఈ సమావేశంలో సాగబోయిన పాపారావు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, జాతీయ అధ్యక్షులు కోట్క విజయ్ కుమార్ ప్రధాన కార్యదర్శి సిద్ధబోయిన లక్ష్మీనారాయణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల రవీందర్ ముక్తిరాజు రాష్ట్ర కోశాధికారి కల్తి రాంప్రసాద్ ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాగబోయిన పాపారావు రాష్ట్ర ప్రచార కార్యదర్శి కోరం ఎర్రయ్య ఆదివాసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుభద్ర తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై నాన్చుడు ధోరణి తగదు!

-అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రత్యేక జీవో ద్వారా స్థలాలు కేటాయించాలి

-జేఎన్‌జే సొసైటీ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం అన్యాయం -ప్రభుత్వ తీరు పై టీడబ్ల్యూజేఎఫ్ ఆగ్రహం



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 31: రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యపు వైఖరిని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) తీవ్రంగా తప్పుబట్టింది. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ స్థలాలు కేటాయించేలా ప్రత్యేక జీవో జారీ చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. గతంలో జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సభ్యులకు నిజాంపేటలో కేటాయించిన 32 ఎకరాల భూమిని పోలీసులు, రెవెన్యూ అధికారుల ద్వారా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని సీల్ వేయించడం ఏమిటని వారు ప్రశ్నించారు. గత 18 ఏళ్ల క్రితం ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు చెల్లించి ఇళ్ల స్థలాల కోసం ఇంతకాలం ఎదురుచూస్తున్న జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ సభ్యులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నిజాం పేటలో సర్వే నంబర్ 332లో 32 ఎకరాలు, పేట్ బషీరాబాద్ సర్వే నెంబర్ 25/2 లో 38 ఎకరాల భూమి కేటాయించారని, ఈ భూమిని ఇప్పుడు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం జర్నలిస్టుల ఆశలపై నీళ్లు చల్లడమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పలుమార్లు హామీలిచ్చారని వారు గుర్తుచేశారు. సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం పలు సందర్భాల్లో జర్నలిస్టులకు త్వరలో ఇళ్ల స్థలాలు అందిస్తామని ప్రకటించినప్పటికీ, ఆచరణలో మాత్రం ఎలాంటి పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులు నేటికీ సొంత ఇంటి స్థలం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే తరహాలో వ్యవహరించకూడదని వారు హితవు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రకటనలకు, హామీలకే పరిమితం కాకుండా ప్రత్యేక ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) జారీ చేసి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిజాంపేటలో జేఎన్‌జే సొసైటీకి కేటాయించిన భూమి విషయంలోనూ ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకొని సభ్యులకు న్యాయం చేయాలని వారు కోరారు.
లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులను సమీకరించి చైతన్య యాత్రలు నిర్వహించడంతో పాటు ఇళ్ల స్థలాల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మామిడి సోమయ్య, తన్నీరు శ్రీనివాస్ లు హెచ్చరించారు.

కూకట్‌పల్లిలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమం

వార్త సంధ్య కూకట్‌పల్లి
ఉమ్మడి హైదరాబాద్ -- రంగారెడ్డి -- మహబూబ్‌నగర్ జిల్లాల ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో భారీ ఎత్తున గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కే పీ హెచ్ బి కాలనీలోని రమ్యా గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ టీ పీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్



నాయకులు రంగమోహన్, నలినీకాంత్, రవి, కళ్యాణ్, రమణల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రాడ్యుయేట్లు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కు నమోదు చేసుకున్నారు.
ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, గ్రాడ్యుయేట్ల చురుగ్గా పాల్గొనడం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొని ఓటర్ల సమన్వయం ప్రక్రియను విజయవంతం చేశారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

సంపాదకీయం


కేసీఆర్ స్వర్ణయుగాన్ని పదేపదే తలుస్తున్నరు



అన్నదాతకు అందని భరోసా..కాళేశ్వరంపై కక్షతో సాగునీటి సంక్షోభం బాండ్ పేపర్ల సాక్షిగా దగా..దాదాపు మూడేండ్లు కావస్తున్నా పట్టాలెక్కని ఆరు గ్యారెంటీలు. మళ్లీ మొదలైన కరెంట్ కోతలు.. కుప్పకూలిన రియల్ ఎస్టేట్, హైదరాబాద్ బ్రాండ్, జాబ్ క్యాలెండర్‌తో యువతకు నిరాశ. ఈ నేపథ్యంలో మళ్లీ కేసీఆర్ స్వర్ణ యుగాన్ని తలచుకుంటున్న తెలంగాణ జనం. బీఆర్ఎస్ పాలనే కావాలంటున్న ప్రజలు. దశాబ్దాల పోరాట ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని తొమ్మిదిన్నరేండ్ల కాలంలోనే దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానిది. ఒకప్పుడు కరెంట్ కోతలు, సాగునీటి కష్టాలు, ఆకలి చావులు, వలసలతో అల్లాడిన తెలంగాణ ప్రాంతాన్ని దేశానికే ధాన్యాగారంగా, ఐటీ రంగంలో అగ్రగామిగా మార్చిన చరిత్ర కేసీఆర్ సొంతం. అయితే 'మార్పు' అనే నినాదంతో, అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హయాంలో తెలంగాణ రాష్ట్రం మళ్లీ పాత రోజుల్లోకి జారుకుంటున్నదనే ఆందోళన ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. కేసీఆర్ నాటి తొమ్మిదిన్నరేండ్ల ప్రగతి ప్రస్థానానికి, ప్రస్తుత అస్తవ్యస్త పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రతిఒక్కరూ ఇప్పుడు బేరీజు వేసుకుంటున్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన వ్యవసాయ రంగాన్ని కేసీఆర్ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుకున్నది. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ, కాళేశ్వరం వంటి భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, 24 గంటల పాటు ఉచిత నాణ్యమైన విద్యుత్తు, సకాలంలో రైతుబంధు పెట్టుబడి సాయం అందించడంతో కరోనా విపత్తు సమయంలోనూ కొత్త రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పంటలు పండాయి. ఇప్పుడు ఇందుకు భిన్నంగా, ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ కక్షతో మేడిగడ్డ వద్ద మరమ్మతులు చేపట్టకుండా, కన్నెపల్లి పంపులను ఆన్ చేయకుండా గోదావరి జలాలను వృథాగా సముద్రంలోకి వదిలేయడంతో సాగునీటి కొరత ఏర్పడింది. శాస్త్రవేత్తలు ముందే హెచ్చరించినా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయకపోవడంతో పాటు, నీరు ఇవ్వలేమంటూ ముఖ్యమంత్రి సహా మంత్రులే స్వయంగా రైతులను పంటలు వేయవద్దని చెప్పడం ప్రభుత్వ ముందుచూపు లేమికి నిదర్శనంగా నిలుస్తున్నది. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కంటే ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏర్పడిన సంక్షోభమే. మరోవైపు ఎన్నికల సమయంలో వంద రోజుల్లోనే అమలు చేస్తామని బాండ్ పేపర్లపై రాసిచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు కాంగ్రెస్ పాలన మూడేండ్లు పూర్తికావస్తున్నా పూర్తిస్థాయిలో పట్టాలెక్కలేదు. కేసీఆర్ హయాంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా అందిన రైతుబంధు, దళితబంధు, కేసీఆర్ కిట్, గొర్రెల పంపిణీ వంటి పథకాలు నేడు నిలిచిపోయాయి. సంపూర్ణ రుణమాఫీలో కొర్రీలు, పెంచిన పింఛన్ల అమల్లో జాప్యం, రేషన్ డీలర్లకు బకాయిలు చెల్లించకపోవడం వంటి అంశాలు సామాన్య, మధ్యతరగతి ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయి. పాలనపై పట్టు సాధించలేక, కేవలం గత ప్రభుత్వంపై బురద చల్లడమే లక్ష్యంగా కాంగ్రెస్ పాలకులు వ్యవహరిస్తున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో పాటు పట్టణ ప్రగతిలోనూ ఇదే తరహా తిరోగమనం కనిపిస్తున్నది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన ఆరు నెలల్లోనే విద్యుత్తు సమస్యను శాశ్వతంగా పరిష్కరించి, దేశంలోనే తలసరి విద్యుత్తు వినియోగంలో తెలంగాణను అగ్రస్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది. కానీ నేడు కాంగ్రెస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ అప్రకటిత విద్యుత్తు కోతలు మొదలవడం పారిశ్రామిక, గృహరంగాలను కుదేలుచేస్తున్నది. బీఆర్ఎస్ పాలనలో ఐటీ శాఖ మంత్రిగా వ్యవహరించిన కేటీఆర్ చొరవతో ఐటీ, ఫార్మా, ఏరోస్పేస్ తదితర రంగాల్లో ప్రపంచ దిగ్గజ సంస్థలు ఎన్నో హైదరాబాద్‌కు క్యూ కట్టాయి. టీ-హబ్, టీఎస్-ఐపాస్ వంటి విప్లవాత్మక విధానాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్, రియల్ ఎస్టేట్, ఉపాధి కల్పన ఉరకలెత్తాయి. కానీ ప్రస్తుత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, స్థిరత్వం లేని విధానాల వల్ల రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలి, పెట్టుబడిదారుల్లో తీవ్ర అభద్రతాభావం నెలకొన్నది. యూత్ డిక్లరేషన్ పేరిట నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలోనూ కాంగ్రెస్ సర్కార్ విఫలమైంది. కేసీఆర్ హయాంలో పోలీస్, గురుకులం, గ్రూప్స్ ద్వారా లక్షలాది ఉద్యోగాల భర్తీ జరిగితే, నేడు జాబ్ క్యాలెండర్ అమల్లో జాప్యం, నిరుద్యోగ భృతి ఊసే లేకపోవడంతో యువత రోడ్లపైకి వచ్చి ఆందోళనలకు దిగాల్సిన దుస్థితి దాపురించింది. ప్రజా సమస్యలపై ప్రతిపక్ష బీఆర్ఎస్ గొంతు విప్పుతుంటే, అసెంబ్లీ వేదికగా అరెస్టులు చేయడం, కొత్త చట్టాల పేరిట ప్రశ్నించే గొంతుకలను, మీడియా స్వేచ్ఛను అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. పాలన అంటే కేవలం రాజకీయ విమర్శలు, కక్షసాధింపు చర్యలు కాదని కాంగ్రెస్ పాలన నిరూపిస్తున్నది. సంక్షోభ సమయాల్లోనూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించిన కేసీఆర్ దార్శనికతకు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనా వైఫల్యాలకు మధ్య ఉన్న తేడాను తెలంగాణ సమాజం నిశితంగా గమనిస్తున్నది. రైతులు, యువత, మహిళలు, కార్మికులు ఇలా అన్ని వర్గాల ప్రజలు మళ్లీ కేసీఆర్ హయాం నాటి సుస్థిర, సంక్షేమ పాలనను కోరుకుంటున్నారు. తెలంగాణ ఇంటి పార్టీగా, రాష్ట్ర ప్రయోజనాలే శ్వాసగా పనిచేసే బీఆర్ఎస్ మాత్రమే రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధిని పట్టాలెక్కించగలదనే నమ్మకం ప్రజల్లో రోజురోజుకూ బలపడుతున్నది.

పచ్చదనం లేని ప్రగతి దారులు



భారతదేశంలో జాతీయ రహదారుల నిర్మాణాలు ఇటీవల కాలంలో చురుగ్గా జరుగుతున్నాయి. దేశంలో ఆర్థిక సంస్కరణల అనంతరం జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం పెరిగింది. ప్రధానిగా వాజ్‌పేయీ కాలంలో స్వర్ణ చతుర్భుజితో రహదారుల నిర్మాణం కొత్త పుంతలు తొక్కింది. దేశంలో 1,32,500 నుంచి 1,51,000 కిలోమీటర్ల మేరకు 599 జాతీయ రహదారులు ఉన్నాయి. వివిధ రాష్ట్రాలు తమకు రహదారుల ప్రాజెక్టులను ఇవ్వాలని పోటాపోటీగా కేంద్రాన్ని కోరుతున్నాయి. తెలుగు రాష్ట్రాలలో ప్రాజెక్టులను గమనించినపుడు రహదారులకు కేంద్ర, రాష్ట్రాలు ఇస్తున్న ప్రాధాన్యం తెలుస్తుంది. భారత రత్నమాల కింద సూర్యాపేట - ఖమ్మం కారిడార్, హైదరాబాద్- శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్, ఎల్‌బీనగర్ (హైదరాబాద్) నుంచి హయత్ నగర్ వరకు డబుల్ డెకర్ ఎలివేటెడ్ కారిడార్, ఆర్మూరు- జగిత్యాల- మంచిర్యాల వరకు, జగిత్యాల నుంచి కరీంనగర్ వరకు నాలుగు వరుసల రహదారులు, హైదరాబాద్- విజయవాడ వరకు 4 వరుసల రహదారి.. 6 వరుసల విస్తరణకు అనుమతులున్నాయి. ఏపీలో కూడా అనంతపురం నుంచి అమరావతి, రాయ్‌పూర్- విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్‌లకు అనుమతులున్నాయి. ఇంకా కొన్ని రహదారుల పనులు జరుగుతున్నాయి. దేశంలో జాతీయ రహదారుల నిర్మాణం 2500 ఏళ్ల క్రితం గ్రాండ్ ట్రంక్ రోడ్‌లో ఆరంభమైంది. చంద్రగుప్త మౌర్యుని కాలంలో నిర్మితమైన ఈ బాటను ఉత్తరపథ మార్గంగా గుర్తించారు. తరువాత అశోకుడు ఈ దారిని అభివృద్ధి చేశాడు. దారికి ఇరుపక్కలా మొక్కలను నాటించి, నూతులు తవ్వించి, విశ్రాంతిశాలలు నిర్మించిన వైనం నేటి ప్రజాప్రభువులకు స్ఫూర్తిదాయకమే. దేశప్రగతికి బాటలైన రహదారుల నిర్మాణంలో అడ్డుగా ఉన్న చెట్లను నరికివేస్తూవస్తున్నారు. ఇలా నరికిచెట్లకు బదులుగా నాటే మొక్కల గణాంకాలు ఉన్నాయా? అంటే.. నరికిన మొత్తం చెట్ల సంఖ్యకు సంబంధించిన సమగ్ర గణాంకాలు లేవని కేంద్ర పర్యావరణ శాఖ 2023లో పార్లమెంటుకు తెలిపింది. అందులో జాతీయ రహదారి-17 విస్తరణకు 40,181 చెట్లు నరికారు. ఢిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్ వేలో గణేశ్‌పూర్ నుంచి డెహ్రాడూన్ వరకు శివాలిక్ అటవీ విభాగంలో 7,747 చెట్లు, 3,258 చిన్న మొక్కలను తొలగించారు.ందుకు పరిహారంగా 1.76 లక్షల చెట్లు నాటాలని ఉత్తరాఖండ్ నిర్ణయించింది. జాతీయ రహదారుల అభివృద్ధి కోసం 2020-21 నుంచి 2023-24 వరకు నరికిన చెట్లకు సంబంధించి కేంద్రం పార్లమెంటుకు సమర్పించిన ప్రాంతీయ కార్యాలయాల లెక్కలు కలిపితే వాటి మొత్తం 57.1 లక్షలుగా తేలుతోంది. ఈ కాలంలో గుజరాత్‌లో 7.61 లక్షలు, ఒడిశాలో 5.78 లక్షలు, కర్ణాటకలో 5.39 లక్షలు, ఉత్తరప్రదేశ్‌లో 2 ప్రాంతీయ కార్యాలయాల పరిధిలో కలిపి 5.42 లక్షలు, తెలంగాణలో 39,852, ఆంధ్రప్రదేశ్‌లో 1,08,433 చెట్లు నరికివేత నమోదైంది. ఈ వివరాలు జాతీయ రహదారుల ప్రాజెక్టులకే సంబంధించినవి. రాష్ట్ర రహదారులు, ఇతర నిర్మాణ ప్రాజెక్టుల వల్ల జరిగిన మొత్తం నరికివేతను ఇవి ప్రతిబింబించవు. మరోవైపు, ఐదేళ్లలో 1.32 లక్షల కిలోమీటర్ల జాతీయ రహదారుల వెంట 3.61 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఈ ఏడాది జూలైలో వెల్లడించింది. ఇందులో తెలంగాణలో 2021-22 నుంచి 2025-26 వరకు 9.15 లక్షల మొక్కలు నాటినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. రహదారుల నిర్మాణంలో కొన్ని దశాబ్దాలుగా ప్రయాణికులకు నీడనిచ్చిన మామిడి, రావి, చింత చెట్లు నామరూపాలు లేకుండా పోతున్నాయి. దశాబ్దాలుగా పెరిగిన పెద్ద వృక్షం అందించే నీడ, ఆక్సిజన్, పక్షులకు ఆవాసం, నేల పరిరక్షణ వంటి ప్రయోజనాలను చిన్న మొక్క వెంటనే అందించలేదు. నాటిన మొక్కలకు తగిన నీరు, సంరక్షణ అందకపోతే అవి ఎండిపోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, ఒక ప్రాంతంలోని సహజ అటవీ సంపదను మరోచోట మొక్కలు నాటడం ద్వారా భర్తీ చేయలేం. స్థానిక వృక్షజాతుల ఎంపిక, జీవవైవిధ్య పరిరక్షణ, మొక్కల మనుగడ శాతంపై పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. 2025లో పార్లమెంటుకు సమర్పించిన గణాంకాల ప్రకారం, జాతీయ రహదారుల వెంట నాటిన మొక్కల మనుగడ.. తెలంగాణలో 93.35 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 82.25 శాతం నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లో పాత రహదారులను 4 లైన్ల రహదారులుగా విస్తరించిన మార్గాలను చూడండి. పదుల కిలోమీటర్లు ప్రయాణించినా.. నీడ దీరడానికి ఒక్క పచ్చని చెట్టు కూడా రహదారి పక్కన కనిపించదు. అంటే ఎన్ని వేల చెట్లు నరికివేతకు గురయ్యాయో చూడండి. వీటి లెక్కలు ఉన్నాయా అంటే సందేహమే. అప్పటివరకు ఉన్న పాత రహదారిలో ఇరువైపులా ఉన్న చెట్ల కింద ప్రయాణికులు తమ వాహనాలను ఆపుకొని సేద తీరేవారు. కొత్తగా నిర్మాణమైన రహదారి మధ్య విభజన (డివైడర్) లో కూడా కొద్దిపాటి ఎత్తుగల మొక్కలే కనిపిస్తాయి తప్ప.. చెట్లు కనిపించవు. డివైడర్‌లో చింత, వేపు, గానుగ వంటి మొక్కలు నాటితే అవి నాలుగేళ్లలో నీడనిచ్చే స్థాయికి పెరుగుతాయి. హైదరాబాద్ - విజయవాడ, బెంగళూరుకు గల 4 లైన్లను 6 లైన్లుగా మార్చే విస్తరణ దశలోనైనా పచ్చదనం పెంపునకు ముఖ్యంగా వేప, రావి, గానుగ, మర్రి, మామిడి నాటాలి. తద్వారా ప్రకృతిని పరిరక్షించడమే కాకుండా.. ప్లవణవాయువు ఆక్సిజన్‌ను ఇస్తాయి. కొత్త రహదారుల కోసం దశాబ్దాల నాటి చెట్లను విచక్షణారహితంగా నరికి వేస్తున్న మనం.. రహదారులు తగినన్ని మొక్కలు నాటుతున్నామా? దారులు పెరిగిన చెట్లు చేసిన మేలు.. కోల్పోయిన చెట్ల స్థానంలో ఎన్ని రెట్లు మొక్కలు నాటినా.. అవి భర్తీ చేయగలవా? కానీపక్షంలో మనం భారీ మూల్యం చెల్లించాల్సిందే. పాలకులు ఆలోచించాలి. వ్యర్థ రక్షణ రక్ష.

హుడా కాలనీలో మాజీ కార్పొరేటర్

భవనంపై అక్రమ నిర్మాణ ఆరోపణలు!

మొదటి తరువాయి

బాధ్యత ఎవరిది? సీజ్ ఉత్తర్వులు అమలవుతున్నాయా లేదా అన్నది పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

స్టిల్ట్+2 అనుమతి.. సెల్లార్ +5 నిర్మాణం ఎలా?

భవన నిర్మాణానికి మంజూరైన అనుమతులు ఒక విధంగా ఉండగా, క్షేత్రస్థాయిలో అదనపు అంతస్తులు నిర్మించారన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. స్టిల్ట్+2కు మాత్రమే అనుమతి ఉండి, సెల్లార్+5 వరకు నిర్మాణం జరిగింది , ఆమోదిత ప్రణాళికకు విరుద్ధంగా నిర్మాణం సాగుతున్న సమయంలో సంబంధిత అధికారులు ఎలాంటి పర్యవేక్షణ చేపట్టారన్నది కీలకంగా మారింది.

నిర్మాణం ఒక్కో అంతస్తు పెరుగుతున్న సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించలేదా? అనుమతులకు విరుద్ధంగా పనులు జరుగుతున్నట్లు గుర్తించినప్పుడు ఎలాంటి నోటీసులు జారీ చేశారు? గతంలో భవనాన్ని సీజ్ చేసిన తర్వాత నిర్మాణం పూర్తిగా నిలిచిపోయేలా ఎలాంటి చర్యలు తీసుకున్నారు? కూల్చివేతలో ఎంత భాగాన్ని తొలగించారు? ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగేందుకు అనుమతులు ఉన్నాయా? అనే ప్రశ్నలకు అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సి ఉంది.

పనులు కొనసాగుతుంటే అధికారుల పర్యవేక్షణ ఏదీ?

సీజ్ చేసిన భవనంలో ప్రస్తుతం కూడా నిర్మాణ పనులు జోరుగా సాగుతుండటంపై స్థానికులు సంబంధిత అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే స్పందించడం కాకుండా, నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచే నిబంధనల అమలుపై నిఘా ఉంచాల్సిన బాధ్యత అధికారులదేనని వారు పేర్కొంటున్నారు. సీజ్ చేసిన భవనంలో తిరిగి పనులు జరుగుతున్నట్లు తెలిసినా అధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదులు చేసినప్పుడు సీజ్‌లు, కూల్చివేతలు చేపట్టి, ఆ తర్వాత నిర్మాణం మళ్లీ కొనసాగితే పట్టించుకోకపోవడం వల్ల అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఎలా పడుతుందని నిలదీస్తున్నారు. నిర్మాణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయన్న ఆరోపణలపై క్షేత్రస్థాయిలో మరోసారి తనిఖీలు నిర్వహించి, భవన అనుమతులు, ఆమోదిత ప్రణాళిక, సీజ్ ఉత్తర్వులు, కూల్చివేత రికార్డులను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సామాజిక, ప్రజాసంఘాల ఫిర్యాదులకూ స్పందన కరువు!

ఈ అక్రమ నిర్మాణంపై స్థానికులతో పాటు సామాజికవేత్తలు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు సైతం పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందించినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు



కనిపించడం లేదని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో భవనాన్ని సీజ్ చేసి, కొంత భాగాన్ని కూల్చివేసిన అధికారులు ఆ తర్వాత నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభమైనా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

ప్రజా సమస్యలపై స్పందించి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా? ఫిర్యాదులు అందినప్పటికీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఎందుకు కొరవడుతోంది? సామాజిక, ప్రజాసంఘాలు ఫిర్యాదులు చేసినా ప్రయోజనం శూన్యంగా మిగలడానికి కారణాలేమిటి? అన్న ప్రశ్నలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను బహిర్గతం చేయడంతో పాటు, నిర్మాణ పనులను తక్షణమే పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రాజకీయ పలుకుబడి ఉందన్న ఆరోపణలు.. విచారణ అవసరం!

ఈ నిర్మాణానికి రాజకీయ పలుకుబడి అండగా ఉందని గతంలో ఫిర్యాదుదారుడు ఆరోపించినట్లు సమాచారం. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలు అధికారిక రికార్డులు, విచారణ ద్వారానే నిర్ధారణ కావాలి. భవన యజమాని లేదా నిర్మాణదారుడి బాధ్యతతో పాటు, అనుమతుల జారీ, క్షేత్రస్థాయి తనిఖీలు, సీజ్ ఉత్తర్వుల అమలు, కూల్చివేత పర్యవేక్షణకు బాధ్యత వహించిన అధికారుల పాత్రను కూడా నిబంధనల ప్రకారం పరిశీలించాల్సిన అవసరం ఉంది.

సీజ్ చేసిన భవనంలో మళ్లీ పనులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు నిజమైతే, సీజ్ ఉత్తర్వుల ఉల్లంఘనకు బాధ్యులెవరు? నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించేందుకు ఏమైనా అనుమతులు ఇచ్చారా? లేక ఎలాంటి అనుమతులు లేకుండానే పనులు కొనసాగుతున్నాయా? అనే అంశాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సామాజిక , ప్రజాసంఘాలు సైతం ఈ అక్రమ నిర్మాణం పై పిర్యాదులు చేసినప్పటికీ ప్రయోజనం మాత్రం సున్యం

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందిస్తారా?

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్నామని చెప్పడం మాత్రమే సరిపోదని, ఆ చర్యలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా లేదా అన్నది కూడా ముఖ్యమని స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో సీజ్ చేసి, కొంత భాగాన్ని కూల్చివేసినట్లు చెబుతున్న భవనంలో ప్రస్తుతం మళ్లీ పనులు కొనసాగుతుండటంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

భవనానికి ఎన్ని అంతస్తులకు అనుమతి ఉంది?

గతంలో ఎప్పుడు సీజ్ చేశారు? కూల్చివేతలో ఎంత భాగాన్ని తొలగించారు? ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్న ఫిర్యాదులపై ఏం చర్యలు తీసుకున్నారు? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగితే బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు? అనే అంశాలను అధికారులు ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

"స్థానికుల ఆగ్రహం.. సామాజికవేత్తల ఫిర్యాదులు..

ప్రజాసంఘాల విజ్ఞప్తులు.. అయినా అక్రమ నిర్మాణం మాత్రం ఆగడం లేదు. మరి అధికార యంత్రాంగాన్ని కదిలించాలంటే ఇంకెన్ని ఫిర్యాదులు చేయాలి?"

సీజ్ చేసినా మళ్లీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలపై ఎల్బీనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటికైనా స్పందిస్తారా? అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుంటారా? లేక ఫిర్యాదులు, సీజ్‌లు, కూల్చివేతలకే పరిమితమవుతారా? అన్నది వేచి చూడాలి.

గమనిక: భవన అనుమతులు, సీజ్ ఉత్తర్వులు, కూల్చివేత వివరాలు, ప్రస్తుత నిర్మాణ స్థితిని నిర్ధారించాలి. సంబంధిత అధికారులు, భవన యజమాని వివరణను కూడా తీసుకుని మరో వార్త ప్రచురించడం జరుగుతుంది.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

కూకట్‌పల్లి ట్రాఫిక్ పిఎస్‌ను తనిఖీ చేసిన డీసీపీ శేషాద్రిని రెడ్డి



వార్త సంధ్య కూకట్‌పల్లి

సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ-2 శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్ వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, అధికారుల పనితీరు, ట్రాఫిక్ విధులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, అంకితభావంతో వ్యవహరించాలని సూచించారు. రహదారులపై ట్రాఫిక్ ఉల్లంఘనలను అరికడుతూ, వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-2 ఏడీసీపీ వీరన్న, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ గిరిప్రసాద్, సీఐ తిమ్మప్పతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని విద్యుత్ వైర్లు బ్లాస్ట్

విద్యుత్ హెచ్చుతగ్గులతో టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, కూలర్లు దెబ్బతిన్న వైనం



దుబ్బాక ప్రతినిధి (వార్తసంధ్య)అక్టోబర్ 31

: సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం చీకోడ్ గ్రామంలో గ్రామపంచాయతీ సీసీ రోడ్డు నిర్మాణ పనుల కోసం వచ్చిన డస్ట్ టిప్పర్ నందికంటి రాములు ఇంటి వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో 11 కేవీ, సింగిల్ ఫేజ్ విద్యుత్ వైర్లు బ్లాస్ట్ అయిన ఘటన చీకోడ్ గ్రామంలో చోటుచేసుకుంది. టిప్పర్ ఢీకొనడంతో సుమారు 30 మీటర్ల మేర విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. దీంతో 2వ, 3వ, 4వ వార్డుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వైర్లు బ్లాస్ట్ అయిన సమయంలో విద్యుత్ హెచ్చుతగ్గులు ఏర్పడటంతో పలువురి ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు దెబ్బతినగా, ఫ్యాన్లు, కూలర్లు కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి దెబ్బతిన్న లైన్లను మరమ్మతు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని, విద్యుత్ హెచ్చుతగ్గుల కారణంగా నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ముదిరాజులను బిసిఏ లో చేర్చే ప్రక్రియ వేగవంతం చేయండి

- ముదిరాజ్ సంక్షేమ సమితి డిమాండ్

-ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లాడి దుర్గం సురేష్ మాట్లాడుతూ

-ముదిరాజులను బిసి-డి నుండి బీసీఏలోకి చేర్చే ప్రక్రియ వేగవంతం చేయాలని ముదిరాజ్ సంక్షేమ సమితి డిమాండ్ చేసింది.



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 31

సోమాజిగూడ,ప్రెస్ క్లబ్ లో సమితి అధ్యక్షులు అల్లాదుర్గం సురేష్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.గత 50 సంవత్సరాలుగా ముదిరాజులు బ్రిటిష్,రజాకార్ల కాలం లో ఉన్న అణిచివేత కంటే పది రెట్లు ఎక్కువగా అనిచివేతకు గురవుతున్నారని అన్నారు.సామాజికంగా,ఆర్థికంగా,విద్యాపరంగా,రాజకీయంగా రిజర్వేషన్లు దక్కక అనేక విధాలుగా బాధలు అనుభవిస్తున్న ముదిరాజులను వెంటనే బీసీఏలోకి చేర్చే ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. ఇప్పటికే సుప్రీం కోర్టు నుండి బీసీ కమిషన్ కు మారిన ముదిరాజుల రిజర్వేషన్ ప్రక్రియ రెండు బీసీ కమిషన్ల కాలంలో పరిష్కరించబడలేదు అని ఇప్పుడున్న బీసీ కమిషన్ కాలం ఒక సంవత్సరం తో ముగియ నున్నదని అంతలోపే బీసీఏలోకి ముదిరాజులను చేర్చి కాంగ్రెస్ ప్రభుత్వం తమ మాట నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తోట సంజీవ్,నర్సింగ్ ముదిరాజ్, బాబు ముదిరాజ్,రమా ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణార్థం రక్తదాన శిబిరం

-రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కార్యక్రమం.. 75 యూనిట్ల రక్తం సేకరణ



జవహర్‌నగర్, అక్టోబర్ 31 (వార్త సంధ్య):

పోలీస్ అమరవీరుల దినోత్సవ కార్యక్రమాల ముగింపు సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జవహర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ రోజ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్, కీసర, శామీర్‌పేట పోలీస్ స్టేషన్ల సిబ్బందితో పాటు ఆయా ప్రాంతాలకు చెందిన యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ రక్తదాన శిబిరంలో యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయగా, సుమారు 75 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానానికి ముందుకు రావాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ డివిజన్ ఏసీపీ చక్రపాణి, జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు, కీసర ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి, శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు. అలాగే ఆయా పోలీస్ స్టేషన్ల అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది, ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది హాజరయ్యారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఇన్‌చార్జ్ రామకృష్ణతో పాటు సంస్థ సిబ్బంది కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు. పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ రక్తదాన శిబిరానికి యువత, ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

సింగరేణి మండలంలో పలు కుటుంబాలను పరామర్శించిన బానోత్ మనీషా లక్ష్మి మదన్ లాల్

అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా



కారేపల్లి ప్రతినిధి, అక్టోబర్ 31 (వార్త సంధ్య):

సింగరేణి మండలంలో పలు కుటుంబాలను వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి మదన్ లాల్ పరామర్శించారు. ఈ సందర్భంగా ముందుగా భాగ్యనగర్ గ్రామంలో తన అభిమాని భూక్యా మధుకు కాలు ఫ్రాక్చర్ అయిన విషయం తెలుసుకుని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కారేపల్లికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు సోమందుల నాగరాజు గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు: మాజీ జడ్పీటీసీ వంగడోత్ జగన్, సీనియర్ నాయకులు డొంకేనా రవి, జూంకి, కిల్లారి వెంకటేశ్వర్లు, పెర్రిని, మాజీ సర్పంచ్‌లు మోహన్, బన్సీలాల్, మూతి కోటేశ్వరరావు, కృష్ణ, ఉప్ప సర్పంచ్‌లు శంకర్, లాలు, మణికొండ నాగేశ్వరరావు, యువజన నాయకులు జడల కళ్యాణ్, రామారావు, హరీష్, సంపత్, మురళి, వంశీ, కారేపల్లి 10వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వద్దిరాజు నేలకొండపల్లిలో నర్సింహారావు భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 31. :

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి సర్పంచ్ శీలం వెంకటలక్ష్మీ భర్త నర్సింహారావు మృతి పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ నాయకుడు, నేలకొండపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ వెంకటలక్ష్మీ భర్త మృతి చెందినట్లు తెలిసిన వెంటనే ఎంపీ రవిచంద్ర శనివారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలదండ వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, నర్సింహారావు మృతితో బీఆర్ఎస్ ఒక మంచి నాయకుడిని కోల్పోవడం జరిగిందని,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. స్వర్గీయ నర్సింహారావు సతీమణి వెంకటలక్ష్మీ,ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు, పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

సర్దార్ పటేల్ నగర్‌లో వైభవంగా జాతీయ ఐక్యత దినోత్సవం



వార్త సంధ్య కూకట్‌పల్లి :

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని సర్దార్ పటేల్ నగర్‌లో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛ భారత్ చైర్మన్, నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ని, ఎంపీ ఈటల రాజేందర్ ని మర్యాదపూర్వకంగా కలిసి జాతీయ ఐక్యత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భారత తొలి ఉప ప్రధాని, 'ఉక్కు మనిషి' సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవంగా జరుపుకోవడం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం వందలాది సంస్థానాలను ఏకతాటిపైకి తెచ్చి అఖండ భారతదేశాన్ని నిర్మించడంలో పటేల్ పోషించిన పాత్ర అద్భుతమైనదని కొనియాడారు. దేశ సమగ్రత, సమైక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, యువభారత్ ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థి-విద్యార్థినులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ ప్రాంగణంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు



వార్త సంధ్య కూకట్‌పల్లి :

భారత తొలి ఉప ప్రధాని, తొలి హోంమంత్రిగా పటేల్ దేశ నిర్మాణానికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం 500కు పైగా సంస్థానాలను --- ముఖ్యంగా హైదరాబాద్ సంస్థానాన్ని --- భారత యూనియన్‌లో విలీనం చేసి దేశ సమగ్రతను కాపాడిన మహోన్నత వ్యక్తి పటేల్ అని గుర్తుచేశారు. బార్డోలీ సత్యాగ్రహం ద్వారా రైతుల హక్కుల కోసం పోరాడిన ఆయన జీవితం, క్రమశిక్షణ, దేశభక్తి నేటి యువతకు ఆదర్శమని అన్నారు. విద్యార్థులందరూ కుల, మత, ప్రాంతీయ భేదాలు వీడి దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్షం వస్తే చాలు.. హైదరాబాద్ అతలాకుతలం!

గంటల వర్షానికే స్తంభిస్తున్న మహానగరం.. అభివృద్ధి ఆర్భాటం సరే.. మౌలిక వసతుల మాటేమిటి?

సంపాదకీయం । వనం రామకృష్ణ

హైదరాబాద్ మహానగరంలో వర్షం కురవడం ప్రకృతి సహజం. కానీ కొద్దిసేపు వాన పడితే చాలు.. రహదారులు చెరువులను తలపించడం, ప్రధాన కూడళ్లు జలమయం కావడం, వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడం, గంటల తరబడి ట్రాఫిక్‌లో ప్రజలు చిక్కుకుపోవడం మాత్రం పాలనా వ్యవస్థలోని లోపాలకు అద్దం పడుతోంది. అక్టోబర్ 31న ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో నగర యంత్రాంగం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం మరింత పెరిగింది.

వర్షం పడితే రోడ్లు ఎందుకు మునుగుతున్నాయి?

పతి వర్షాకాలంలోనూ ఇదే దృశ్యం. నాలాలు పొంగిపొర్లడం, డ్రైనేజీలు నిండిపోవడం, రహదారులపై మోకాళ్ల లోతు నీరు నిలవడం నిత్యకృత్యంగా మారుతోంది. ఏళ్ల తరబడి నిర్మిస్తున్న ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రహదారుల విస్తరణ పనులు నగర రూపురేఖలను మార్చుతున్నా.. వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు అవసరమైన వ్యవస్థలు మాత్రం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందడం లేదు. అభివృద్ధి అంటే కాంక్రీట్ నిర్మాణాలే కాదు.. ప్రకృతి విపత్తులను తట్టుకునే మౌలిక వసతులు కూడా!

ట్రాఫిక్ కష్టాలు.. ప్రజల సమయం ఎవరు తిరిగిస్తారు?

వర్షం మొదలైతే కార్యాలయాలకు వెళ్లేవారు, పాఠశాల విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర సేవల వాహనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కొద్ది కిలోమీటర్ల ప్రయాణానికి గంటల సమయం వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అంబులెన్సులు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుంటే రోగుల ప్రాణాలకే ముప్పు. నీటిలో చిక్కుకున్న ద్విచక్ర వాహనదారులు, గుంతలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్న వాహనదారుల సమస్యలు మరింత ఆందోళనకరం.



హెచ్చరికలు జారీ చేయడమే కాదు.. ముందస్తు చర్యలేవి?

వాతావరణ శాఖ వర్ష సూచనలు ఇవ్వడం తన బాధ్యత. ఆ హెచ్చరికలను కార్యాచరణగా మార్చడం అధికార యంత్రాంగం బాధ్యత. నాలాల పూడికతీత, మ్యాన్‌హోళ్ల మరమ్మతులు, నీరు నిలిచే ప్రాంతాల గుర్తింపు, పంపింగ్ యంత్రాల సిద్ధత, ట్రాఫిక్ మళ్లింపులపై ముందస్తు ప్రణాళిక ఉండాలి. జీహెచ్ఎంసీ, హైడ్రా, జలమండలి, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేయాలి. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగాలి.

శాశ్వత పరిష్కారమే అసలైన అభివృద్ధి

తాత్కాలికంగా నీటిని తోడేయడం, రోడ్లపై బారికేడ్లు ఏర్పాటు చేయడం సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. నగరంలోని వరద ముంపు ప్రాంతాలను శాస్త్రీయంగా గుర్తించి, వర్షపు నీటి పారుదల వ్యవస్థను ఆధునికీకరించాలి. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణలను తొలగించాలి. సహజ నీటి ప్రవాహ మార్గాలను కాపాడాలి. నిర్మాణ అనుమతుల విషయంలో నిబంధనలను కఠినంగా అమలు చేయాలి. వర్షపు నీటి నిర్వహణకు ప్రత్యేక దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలి.

ప్రజల భద్రతే పాలనకు గీటురాయి!

హైదరాబాద్ ఐటీ, పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోంది. ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యాలు మంచివే. కానీ వర్షం పడితే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడే పరిస్థితి ఉంటే ఆ అభివృద్ధికి అర్థమేమిటి? ప్రకటనలు, ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, భారీ నిర్మాణాలకే ప్రాధాన్యం ఇస్తే సరిపోదు. సామాన్యుడి ప్రయాణం సురక్షితంగా సాగడం, వర్షపు నీరు ఇళ్లలోకి చేరకుండా ఉండడం, అత్యవసర సేవలకు ఆటంకం కలగకపోవడమే నిజమైన పట్టణాభివృద్ధి.

ప్రతి వర్షం తర్వాత సమీక్షలు నిర్వహించడం కంటే.. వర్షం రాకముందే సమస్యలను పరిష్కరించే పాలనా దక్షత అవసరం. ప్రకృతిని నిందిస్తూ బాధ్యత నుంచి తప్పించుకోవడం కాదు.. ప్రకృతి విపత్తులను తట్టుకునే నగరాన్ని నిర్మించడం పాలకుల కర్తవ్యం.

హైదరాబాద్‌కు కావాల్సింది మరో భారీ ప్రాజెక్టు మాత్రమే కాదు.. వర్షం వచ్చినా ఆగని నగర జీవనం. ప్రజల సమయాన్ని, భద్రతను, ప్రాణాలను కాపాడే బాధ్యతాయుతమైన పాలన!లి

వనం రామకృష్ణ,
ఉత్తమ సీనియర్ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత.



వార్తసంధ్య
www.vaarthasandhya.com

'ర్యాలీ వాయిదాకు మీరైనా ఒప్పించండి'



న్యూఢిల్లీ: అక్టోబర్ 31 (వార్త సంధ్య):
విపక్ష నేత రాహుల్ గాంధీకి పలు లేఖలు రాసినా ప్రయోజనం లేకపోవడంతో దీపావళి ప్రధాన షాపింగ్ సీజన్‌ను కాపాడటానికి జోక్యం చేసుకోవాలని కోరుతూ ఢిల్లీ వ్యాపారులు శనివారం ఇండియా కూటమిలోని ఇతర నాయకులైన అఖిలేశ్ యాదవ్, మమతా బెనర్జీ, తేజస్వీ యాదవ్, ఉద్ధవ్ థాక్రే తదితరులను ఆశ్రయించారు. ప్రతిపక్ష నాయకులకు చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ(సీటీఐ) ఒక లేఖ రాస్తూ రామ్‌లీలా మైదాన్‌లో ఆదివారం జరగనున్న కాంగ్రెస్ ర్యాలీని నవంబర్ 10-11 తర్వాత మరో తేదీకి మార్చేలా కాంగ్రెస్‌ను ఒప్పించాలని కోరింది. ఈ ర్యాలీ వల్ల ప్రధాన మార్కెట్లలో రోజుకు రూ.10,000-12,00

గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత

ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసిన కేంద్రం



న్యూఢిల్లీ: అక్టోబర్ 31 (వార్త సంధ్య):
గిగ్, ప్లాట్‌ఫామ్, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వీరి సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు 'నేషనల్ సోషల్ సెక్యూరిటీ బోర్డ్ ఫర్ అన్‌ఆర్గనైజ్డ్ వర్కర్స్ అండ్ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్'ను ఏర్పాటు చేస్తూ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ మంత్రి ఈ బోర్డుకు అధ్యక్షత వహిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో పాటు అగ్రిగేటర్ సంస్థలు, యజమానులు, కార్మిక సంఘాలు, పౌర సమాజ సంస్థల ప్రతినిధులు దీనిలో సభ్యులుగా ఉంటారు.గిగ్, ప్లాట్‌ఫామ్, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ పథకాలను సిఫార్సు చేయడం, వాటి అమలును పర్యవేక్షించడం బోర్డు ప్రధాన బాధ్యతలు. బోర్డు ఏడాదిలో మూడుసార్లు సమావేశం అవుతుంది. ప్రస్తుత నోటిఫికేషన్‌లో కొత్త పథకాలు, నిధుల వివరాలను ప్రకటించలేదు. బోర్డు ఏర్పాటు నిర్ణయాన్ని ఆల్ ఇండియా ఎన్‌పీఎస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు మంజీత్ సింగ్ పటేల్ స్వాగతించారు.

ఆ చోరీ వెనుక ఉన్నది నార్త్ కొరియా హ్యాకర్లే



న్యూఢిల్లీ అక్టోబర్ 31 (వార్త సంధ్య):
బినాన్స్ క్రిప్టో ఏజెన్సీపై దాడి చేసి హ్యాకర్లు సుమారు 6.3 బిలియన్ల డాలర్లు చోరీ చేసిన విషయం తెలిసిందే. ఆ చోరీ వెనుక ఉత్తర కొరియా హ్యాకర్లు ఉన్నట్లు క్రిప్టో నిపుణులు భావిస్తున్నారు. చోరీ చేసిన క్రిప్టోలతో ఉత్తరకొరియా తన ఆయుధ సంపదను పెంచుకుంటోందని సైబర్ సెక్యూర్టీ నిపుణులు చెప్పారు. నార్త్ కొరియాకు చెందిన ట్రేడర్ ట్రైటర్ అనే గ్రూపు క్రిప్టో చోరీలకు పాల్పడినట్లు బ్లాక్‌చైయిన్ దర్యాప్తు కంపెనీ టీఆర్ఎం ల్యాబ్స్ పేర్కొన్నది. క్రిప్టోకరెన్సీ కంపెనీలలో ఉన్న సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, ఐటీ సిబ్బందిని మోసపూరిత సాఫ్ట్‌వేర్ ద్వారా హ్యాక్ చేసినట్లు తేల్చారు. 2025 చివర వరకు ఉత్తర కొరియా హ్యాకర్లు సుమారు 6.75 బిలియన్ల డాలర్ల క్రిప్టోకరెన్సీని మాయం చేశారు.గతంలో బైబిట్, బిట్‌గెట్ లాంటి ఎక్సేంజీలను నార్త్ కొరియా హ్యాకర్లు టార్గెట్ చేశారు. నార్త్ కొరియా ఇప్పటి వరకు సుమారు 14 బిలియన్ల డాలర్ల క్రిప్టోను చోరీ చేసినట్లు సైబర్‌సెక్యూర్టీ పరిశోధకుడు మైఖేల్ బార్న్‌హర్ట్ తెలిపారు. చోరీ జరిగిన క్రిప్టోకరెన్సీని ఫ్రీజ్ చేస్తామని బినాన్స్ తెలిపింది. ఇప్పటివరకు సుమారు 3 బిలియన్ల డాలర్ల చోరీ సొత్తును గుర్తించినట్లు నిపుణులు పేర్కొన్నారు. ట్రేడర్‌ట్రైటర్ అనే నార్త్ కొరియాకు చెందిన హ్యాకింగ్ గ్రూపు.. ఏపీటీ398 ర్యాంకులో నిష్ణాతులు అని తేలింది. మాల్వేర్, ఫోన్ ద్వారా డెవలపర్లు, ఐటీ సిబ్బందిని టార్గెట్ చేస్తారని పరిశోధకులు చెబుతున్నారు.

తండ్రి చికిత్స కోసం సీజ్ చేసిన బంగారం తాకట్టు.. కానిస్టేబుల్ అరెస్ట్!

-రూ.12.37 లక్షలు తీసుకున్న వైనం.. మరో కేసులో రూ.1.70 లక్షల అక్రమ బదిలీ
-మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్‌పై కేసు నమోదు
-సీజ్ చేసిన సొత్తుకే భద్రత కరువు.. పోలీస్ వ్యవస్థలో పర్యవేక్షణపై ప్రశ్నలు!



మీర్‌పేట, అక్టోబర్ 31 (వార్త సంధ్య):
ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు శాఖలో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ విధుల దుర్వినియోగానికి పాల్పడిన ఘటన మీర్‌పేటలో వెలుగుచూసింది. కేసుల దర్యాప్తులో భాగంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లను అక్రమంగా వినియోగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్ శ్రవణ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఒక కేసులో సెల్‌ఫోన్ ద్వారా రూ.1.70 లక్షలు తన ఖాతాకు బదిలీ చేసుకోగా, మరో కేసులో సీజ్ చేసిన బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.12.37 లక్షలు పొందినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం.

సీజ్ చేసిన బంగారం తాకట్టు.. రూ.12.37 లక్షలు!
మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రవణ్.. ఓ కేసులో పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను అక్రమంగా తాకట్టు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాటి ద్వారా రూ.12.37 లక్షల నగదును పొందినట్లు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. మరో కేసులో సీజ్ చేసిన సెల్‌ఫోన్ నుంచి రూ.1.70 లక్షలను తనకు అక్రమంగా బదిలీ చేసుకున్నట్లు గుర్తించినట్లు సమాచారం. కేసుల దర్యాప్తులో భాగంగా భద్రపరచాల్సిన సొత్తును వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకోవడం పోలీసు శాఖలో కలకలం రేపింది.

తండ్రి క్యాన్సర్ చికిత్స కోసమేనా?
తన తండ్రి ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్నారని, ఆయన వైద్య చికిత్సకు అవసరమైన డబ్బు సమకూర్చుకునేందుకే ఈ చర్యలకు పాల్పడినట్లు శ్రవణ్ వెల్లడించినట్లు సమాచారం. అయితే, ఈలోగా ఆయన తండ్రి ఇటీవలే మరణించినట్లు తెలిసింది. కుటుంబ పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ, కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఆస్తులను వ్యక్తిగత అవసరాలకు వినియోగించడం చట్టపరంగా తీవ్రమైన అంశంగా మారింది.

కానిస్టేబుల్ అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు!
సీజ్ చేసిన బంగారం, నగదు దుర్వినియోగం వ్యవహారం వెలుగులోకి రావడంతో పోలీసులు శ్రవణ్‌పై కేసు నమోదు చేశారు. అనంతరం అతడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో మరిన్ని వివరాలు, సీజ్ చేసిన ఆస్తుల నిర్వహణలో జరిగిన పరిణామాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

సీజ్ చేసిన సొత్తుకు భద్రత ఏదీ?
ప్రజల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు, ఇతర విలువైన వస్తువులు పోలీస్‌స్టేషన్లలో లేదా సంబంధిత భద్రపరిచే కేంద్రాల్లో పకడ్బందీగా ఉండాల్సి ఉంటుంది. వాటి వివరాలు, భద్రపరిచిన విధానం, అప్పగింతలు, తనిఖీలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. రక్షణ కల్పించాల్సిన వ్యవస్థలోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే బాధితులకు పోలీసు వ్యవస్థపై ఉన్న నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉంది. సీజ్ చేసిన ఆస్తుల భద్రతపై ఉన్నతాధికారులు మరింత పారదర్శకమైన పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరాన్ని ఈ ఘటన స్పష్టం చేస్తోంది.

హోటళ్లలో బొద్దింకలు.. ఎలుకల సంచారం!

-హైదరాబాద్‌లో హోటళ్లపై టీజీ సేఫ్ కొరడా.. 544 కిలోల కలుషిత ఆహారం ధ్వంసం
-వంటగదుల్లో అపరిశుభ్రత.. గుట్కా ప్యాకెట్లు, సింథటిక్ రంగుల వినియోగం!
-22 హోటళ్లలో తనిఖీలు.. 14 హోటళ్ల లైసెన్సుల సస్పెన్షన్



హైదరాబాద్, అక్టోబర్ 31 (వార్త సంధ్య):
నగరంలోని ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రతా ప్రమాణాలు గాలికి పదిలేస్తున్నారా? వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించాల్సిన హోటళ్లలోనే బొద్దింకలు, ఎలుకల సంచారం కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. అపరిశుభ్ర వంటగదులు, బూజుపట్టిన ఆహార పదార్థాలు, పదేపదే వినియోగించిన వంట నూనె వంటి ఉల్లంఘనలపై టీజీ సేఫ్ అధికారులు భారీ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 544 కిలోల కలుషిత ఆహారాన్ని ధ్వంసం చేయగా, 14 హోటళ్ల లైసెన్సులను సస్పెండ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

22 ప్రత్యేక బృందాలతో ఏకకాలంలో తనిఖీలు!
గోల్కొండ, చార్మినార్ జోన్ల పరిధిలో 22 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి 22 హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా పలు సంస్థల వంటగదుల్లో కనీస పరిశుభ్రతా ప్రమాణాలు పాటించకపోవడం, బూజుపట్టిన ఆహార పదార్థాలు నిల్వ ఉంచడం, బొద్దింకలు, ఎలుకలు సంచరించడం అధికారుల దృష్టికి వచ్చాయి. అంతేకాకుండా ఒకసారి వినియోగించిన వంట నూనెను పదేపదే ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో సుమారు 544 కిలోల కుళ్లిన, కలుషిత ఆహార పదార్థాలను గుర్తించి ధ్వంసం చేశారు. ఆహార నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేస్తూ 21 నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలకు పంపించారు. నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 8 సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

సోహైల్ రెస్టారెంట్‌లో గుట్కా ప్యాకెట్లు..
మలక్‌పేటలోని సోహైల్ రెస్టారెంట్ వంటగదిలో గుట్కా ప్యాకెట్లు, ఉమ్మిన ఆనవాళ్లు కనిపించినట్లు టీజీ సేఫ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సమాచారం. అంతేకాకుండా ఆహార తయారీలో సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగించినట్లు గుర్తించారు. ఆహార పదార్థాలు తయారుచేసే ప్రాంతాల్లో కనీస పరిశుభ్రత కూడా పాటించకపోవడంపై అధికారులు తీవ్రంగా స్పందించారు.

లైసెన్సులు సస్పెండ్ చేసిన హోటళ్ల వివరాలు
అధికారులు విడుదల చేసిన వివరాల ప్రకారం లైసెన్సులు సస్పెండ్ అయినట్లు పేర్కొన్న హోటళ్లు, రెస్టారెంట్లు ఇవి:
1. హోటల్ శ్రీ రాఘవేంద్ర ఉడిపి వెజ్ -- టోలిచౌకి, సంతోష్‌నగర్
2. లక్కీ రెస్టారెంట్ -- సంతోష్‌నగర్
3. షా ఘౌస్ కేఫ్ -- షాలిబండ
4. హోటల్ నయాబ్ -- చార్మినార్
5. శ్రీ బాలాజీ ఫ్యామిలీ ధాబా -- గుడిమల్కాపూర్
6. సిద్ధిక్ కబాబ్ సెంట్రల్ కిచెన్ -- గుడిమల్కాపూర్
7. అల్‌సబా హోటల్ -- టోలిచౌకి
8. మెహఫిల్ రెస్టారెంట్ -- దిల్‌సుఖ్‌నగర్
9. డైన్ హిల్ రెస్టారెంట్ -- మాసబ్‌ట్యాంక్
10. సోహైల్ రెస్టారెంట్ -- మలక్‌పేట
11. హోటల్ అక్షయ టిఫిన్స్ -- మలక్‌పేట
12. హోటల్ వెంకటేశ్వర -- ఎంజేఆర్ రోడ్
13. అజీబో ది రాయల్ అరేబియన్ రెస్టారెంట్ -- రెతిబౌలి

హోటళ్ల యాజమాన్యాలపై నిఘా.. వినియోగదారుల ఆరోగ్యమే ముఖ్యం!
ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహించే హోటళ్లు, రెస్టారెంట్లపై తనిఖీలను మరింత విస్తృతం చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. అయితే ప్రజలు ప్రతిరోజూ ఆహారం కోసం ఆశ్రయించే హోటళ్లలోనే ఇలాంటి పరిస్థితులు వెలుగుచూడటం ఆందోళన కలిగిస్తోంది. లైసెన్సుల సస్పెన్షన్‌తోనే చర్యలు పరిమితం కాకుండా, ప్రయోగశాల పరీక్షల ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

జమ్ము కశ్మీర్ సీఎంపై 24 మంది ఎమ్మెల్యేల అసంతృప్తి

నలుగురు మంత్రులు, సీఎం సలహాదారును తొలగించాలని డిమాండ్



శ్రీనగర్: అక్టోబర్ 31 (వార్త సంధ్య):
జమ్ము కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఇటీవల చేపట్టిన క్యాబినెట్ విస్తరణపై పాలక పక్షం నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన 24 మంది ఎమ్మెల్యేల్లో అసంతృప్తి వ్యక్తమైంది. వీరిలో 18 మంది ఎమ్మెల్యేలు శుక్రవారం లోలబ్ ఎమ్మెల్యే ఖైసర్ జంషీద్ ఇంట్లో సమావేశం కాగా ఆరుగురు ఎమ్మెల్యేలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సీఎం సలహాదారు నసిర్ సోగామి, నలుగురు కొత్త మంత్రులను తొలగించాలని వారు డిమాండ్ చేశారు.క్యాబినెట్‌లోనూ భారీ మార్పులు చేపట్టాలని కోరారు. సోగామి పార్టీ విధుల్లో జోక్యం చేసుకొంటూ నాయకత్వాన్ని తప్పు దోవ పట్టిస్తున్నారని వారు ఆరోపించారు. తమ డిమాండ్లపై పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లాను, సీఎం ఒమర్ అబ్దుల్లాను కలవాలని వారు నిర్ణయించుకొన్నారు. తాము పార్టీని వీడబోమని ప్రతిజ్ఞ చేశారు. కొందరు పార్టీ అంతర్గత పనితీరును బలహీనపరుస్తున్నారని అసంతృప్త ఎమ్మెల్యేలు విమర్శించారు.

జర్నలిస్టును పెండ్లాడిన ఒమర్
పాత్రికేయురాలు నిధీ రాజ్‌దాన్‌ను తాను పెండ్లి చేసుకొన్నట్లు జమ్ము కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా శనివారం ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించారు. ఆమెతో ఉన్న ఫొటోను షేర్ చేస్తూ 'నిన్న కొత్త ప్రయాణం ప్రారంభమైంది' అని పేర్కొన్నారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com



రజనీకాంత్ 'జైలర్ 2' అరుదైన రికార్డు..

రూ.800 కోట్ల దిశగా పరుగులు, నాలుగు రాష్ట్రాల్లో సరికొత్త చరిత్ర!



సూపర్‌స్టార్ రజనీకాంత్ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతున్నారు. ఆయన నటించిన తాజా చిత్రం 'జైలర్ 2' వసూళ్లలో సరికొత్త రికార్డులు సృష్టిస్తూ దూసుకెళ్తోంది. 2023లో విడుదలై సంచలన విజయం సాధించిన 'జైలర్' చిత్రానికి కొనసాగింపుగా వచ్చిన ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధిస్తోంది. ఇప్పటికే రూ.800 కోట్ల మార్కుకు చేరువలో ఉన్న ఈ చిత్రం మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది.జైలర్ 2' బాక్సాఫీస్ ప్రయాణంలో అత్యంత ప్రత్యేకమైన విషయం ప్రాంతాలవారీగా సాధించిన వసూళ్లు. తమిళనాడు, తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, కేరళ.. ఇలా నాలుగు ప్రాంతాల్లోనూ ఒక్కొక్కటిగా రూ.75 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన తొలి చిత్రంగా 'జైలర్ 2' కొత్త రికార్డు సృష్టించింది. సాధారణంగా ఒక సినిమా తన సొంత రాష్ట్రంలో భారీ వసూళ్లు సాధించడం సహజం. కానీ ఇతర భాషా ప్రాంతాల్లోనూ ఇదే స్థాయిలో ఆదరణ పొందడం విశేషం. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో రజనీకాంత్‌కు ఉన్న అభిమాన బలం మరోసారి నిరూపితమైంది. కర్ణాటక, కేరళలోనూ ఈ సినిమాకు మంచి స్పందన లభించడంతో ప్రాంతీయ హద్దులను దాటి తలైవా క్రేజ్ కొనసాగుతోందని ఈ వసూళ్లు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.800 కోట్ల దిశగా సాగుతున్న ఈ చిత్రం రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులను అందుకుంటుందా అన్న ఆసక్తి సినీ వర్గాల్లో నెలకొంది. సన్ పిక్చర్స్ సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ చిత్రంలో రజనీకాంత్ ప్రధాన పాత్రలో నటించారు. ఆయనకు జోడీగా కాకుండా కథలో కీలక పాత్రల్లో విద్యాబాలన్, ఎస్.జే. సూర్య, సూరజ్ వెంజరమూడు, మిథున్ చక్రవర్తి, రమ్యకృష్ణ, మిర్నా మీనన్, నమో నారాయణ్ వంటి ప్రముఖ నటులు కనిపించారు. ఇక ఈ సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా పలువురు స్టార్ హీరోల అతిథి పాత్రలు నిలిచాయి. హృతిక్ రోషన్, మోహన్‌లాల్, విజయ్ సేతుపతి, శివరాజ్‌కుమార్ ప్రత్యేక పాత్రల్లో కనిపించడం సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచింది. ముఖ్యంగా విభిన్న సినీ పరిశ్రమలకు చెందిన ప్రముఖ నటులు ఒకే సినిమాలో భాగం కావడం అభిమానులకు ప్రత్యేక అనుభూతిని అందించింది.

పా. రంజిత్ 'వేట్టువం' రిలీజ్ డేట్ ఫిక్స్..

- సంక్రాంతి 2027 బరిలో భారీ యాక్షన్ ఎపిక్!



సరికొత్త కథాంశాలతో సినిమాలను తెరకెక్కిస్తూ టాలీవుడ్, కోలీవుడ్‌లలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుడు పా. రంజిత్ తెరకెక్కిస్తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ ప్రాజెక్ట్ 'వేట్టువం' విడుదలకు సంబంధించిన అఫిషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చేసింది. ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు మేకర్స్ ముహూర్తం ఫిక్స్ చేశారు. ప్రతిష్ఠాత్మకమైన సంక్రాంతి 2027 కానుకగా వచ్చే ఏడాది జనవరిలో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించారు.ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్ అండ్ టీజర్ ఇప్పటికే సోషల్ మీడియాలో భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. ఇది ఒక ఇంటెన్స్ పోస్ట్-అపొకలిప్టిక్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోంది. హాలీవుడ్ కల్ట్ క్లాసిక్ మూవీ 'మ్యాడ్ మాక్స్: ఫ్యూరీ రోడ్' తరహా వైబ్స్ మరియు ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉండబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. భూమి విధ్వంసం, కార్పొరేట్ సిండికేట్లు మరియు ప్రాచీన సంస్కృతికి మధ్య జరిగే పోరాట నేపథ్యంలో ఈ కథ సాగనుంది.ఈ చిత్రంలో టాలెంటెడ్ హీరో ఆర్య హీరోగా నటిస్తుండగా, శోభిత ధూళిపాళ, వి.ఆర్. దినేష్ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీరితో పాటు కలైయరసన్, గురు సోమసుందరం, జాన్ విజయ్, షాబీర్ తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. నీలం ప్రొడక్షన్స్ మరియు లెర్న్ అండ్ టీచ్ ప్రొడక్షన్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి అదిరిపోయే మ్యూజిక్ అందిస్తున్నారు.

ఈ నగరానికి ఏమైంది' సీక్వెల్ ట్రైలర్ అప్‌డేట్..

-వచ్చేస్తోన్న మ్యాడ్ గ్యాంగ్!



టాలీవుడ్ యువతను ఊపేసిన కల్ట్ హిట్ సినిమా ఈ నగరానికి ఏమైందికి సీక్వెల్‌గా వస్తున్న చిత్రం 'ఈఎన్ఈ రీపీట్' . టాలెంట్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ తెరకెక్కించిన ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా.. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్‌ను ప్రకటించి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు.ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను నవంబర్ 3వ తేదీ సాయంత్రం 5:00 గంటలకు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రంలో విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, శ్రీకాంత్ మగంటి, వెంకటేష్ కాకుమాను తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ సినిమాకు వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. కాగా, ఈ పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్ సినిమా నవంబర్ 19, 2026 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ట్రైలర్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

నా భర్తలో ఆ క్వాలిటీస్ ఉండాలి..

-మనసులోని మాట బయటపెట్టిన సాయి పల్లవి



ప్రస్తుతం రామాయణ సినిమాతో గ్లోబల్ వైడ్ ట్రెండ్ అవుతున్న సాయి పల్లవికి బాలీవుడ్ బిగ్ బీ నుంచి ఓ క్రేజీ ప్రశ్న ఎదురైంది. రీసెంట్ గా కౌన్ బనేగా కరోడ్ పడి షోకు వెళ్లిన సాయి పల్లవికి.. మీ జీవిత భాగస్వామిలో ఎలాంటి లక్షణాలు ఉండాలని కోరుకుంటున్నారు? అంటూ అమితాబ్ సూటిగా.. ఈగర్‌గా ప్రశ్నించారు. దీంతో సాయి పల్లవి నవ్వుతూ.. సిగ్గుపడుతూ.. అంతే కాన్ఫిడెన్స్ గా చెప్పిన ఆన్సర్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది. తనకు కాబోయే భర్త మంచి మనిషి అయి ఉండాలని సాయి పల్లవి చెప్పారు. తన గురించి మాత్రమే ఆలోచించే వ్యక్తి కాకూడదని, తన ప్రవర్తనను తాను విశ్లేషించుకోగలగాలని ఆమె చెప్పుకొచ్చారు. తాను చేసే పనులను పరిశీలించుకోవడమే కాదు.. జీవితంలో తానెక్కడ ఉన్నాడో అర్థం చేసుకునే పరిణతి కూడా ఉండాలని సాయి పల్లవి చెప్పుకొచ్చారు. తప్పులు చేయొచ్చు.. కానీ వాటిని సరిదిద్దుకోవాలి. తన తప్పులకు ఇతరులను నిందించకూడదు. మంచి మనిషి అయి ఉండాలి. వంట చేయడం కూడా తెలిస్తే ఇంకా మంచిది అంటూ.. అని సాయిపల్లవి తన మనసులో మాటను అమితాబ్ ముందు బయట పెట్టారు.

పాటల పల్లకిలో 'ఎల్లమ్మ'

తెలంగాణ జానపద కళాకారులు, గ్రామ దేవతల నేపథ్య కథాంశంతో రూపొందుతున్న చిత్రం 'ఎల్లమ్మ'. 'బలగం' ఫేమ్ వేణు యెల్దండి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ కథానాయకుడిగా పరిచయమవుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం చిత్రబృందం ఇంట్రెస్టింగ్ అప్‌డేట్‌ను వెల్లడించింది. ప్రస్తుతం ఈ సినిమా టైటిల్ సాంగ్ రికార్డింగ్ జరుగుతున్నది.ఈ పాటకోసం దేశం నలుమూలల నుంచి తీసుకొచ్చిన వంద మంది జానపద రిథమ్ ప్లేయర్స్ పనిచేస్తున్నారు. చిత్ర హీరో, సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ తనదైన శైలిలో జానపద సంగీతంలోని అసలైన వైబ్‌ను ఆవిష్కరిస్తూ ఈ పాటను రూపొందిస్తున్నారు. ఈ పాటను త్వరలో విడుదల చేయబోతున్నారు. 'ఎల్లమ్మ' చిత్రం వచ్చే ఏడాది మార్చి 5న ప్రేక్షకుల ముందుకురానుంది.



The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.